# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com


**నమ్మలేని నిజాలు**

కోట గోడలు
మేడలకు బీటలు
పనిలో నీతి.

నిరసనలు
చెవిలోని జోరీగ
రాతి హృదయం.

ఆర్థిక లోటు
దిద్దుబాటు బాటలు
కాసుల మోత .

ఎనుబోతులు
డబ్బులు మేస్తున్నాయి
తప్పదు బందె.

మానదా పుండు
శాంతి మందు కావాలి
దూత రావాలి.

– రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

ఎవడిభూమి ఎవడి పంట
తన నష్టం తన కష్టం!
ఏ పంటేసుకోవాలో
పండించుట తన ఇష్టం !

యాసంగిలొ వరిపంటకు
పట్టనుంద చిలుం ?
సాగుచేయ వద్దంటూ
ఇదేమయ్య జులుం ?

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245


హైదరాబాద్ | గురువారం 28-10-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 67 | పేజీలు:6 | వెల: రూ.1/-


## బండి సంజయ్ చిల్లర ఆరోపణలు మానుకో..: మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్..

హుజురాబాద్, అక్టోబర్ 27:బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చిల్లర ఆరోపణలు మానుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. హుజూరాబాద్ లోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బండి సంజయ్ ఇష్టమున్నట్లు మాట్లాడుతున్నాడు, మరి మేము కూడా తలుచుకుంటే ప్రధాని మోడి మీద మాట్లాడలేమా..? అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల వాళ్లు సంతోషంగా ఉన్నారని, అన్ని వర్గాల ప్రజలను అక్కున చెర్చుకున్న వ్యక్తి కెసిఆర్ అని తలసాని అన్నారు.

కరోనా సమయంలో ప్రజల పక్షాన ప్రభుత్వం నిలుచున్నామన్నారు. హుజురాబాద్ నియోజకవర్గంలో టిఆర్ఎస్‌కి ప్రజలు బ్రహ్మ రథం పడుతున్నారని అన్నారు. ప్రజలంతా టీఆర్ఎస్‌కు మద్దతుగా ఉన్నారని రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తారని అన్నారు. గోడ గడియారాలు, బొట్టు బిళ్లలు, కుట్టు మిషన్‌లు ఇచ్చింది ఈటల రాజేందర్ కాదా..? అన్నారు. ఆయన ఎన్ని వస్తువులు పంచినా ప్రజలు ఓటు మాత్రం టీఆర్ఎస్‌కే వేస్తారని ఆయన చెప్పారు. సత్య హరిచంద్రునిలా బండి సంజయ్ మాట్లాడుతున్నారు. ఆయన చేయమని చెప్పిందే కేంద్ర మంత్రి పియూష్ గోయల్ కానీ టీఆర్ఎస్ మీద దుష్ప్రచారం చేస్తున్నారు. వ్యవసాయ చట్టాలు అన్ని కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోనే ఉంటాయి రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండవు అని అన్నారు. రైతులు ఎంత పంట పండించినా కేంద్రం కొనడానికి ముందు కు రావాలన్నారు.

కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయమని చెప్పినా కూడా రాష్ట్రప్రభుత్వం కొంటున్నదన్నారు. కానీ బీజేపీ వాళ్లు ప్రజలకు వరి కొనరని మభ్యపెడుతున్నరు.. ఎవరూ ఆందోళన పడవద్దు రైతులకు అండగా ఉండేది టీఆర్ఎస్ ప్రభుత్వమే అని గంగుల అన్నారు. ఎక్కడ చూసినా పంటపొలాలతో హుజూరాబాద్ సీడ్ బౌల్ ఆఫ్ తెలంగాణ గా మారింది.. ఇది కాదా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అని ఆయన ప్రశ్నించా రు. గ్లోబల్స్ ప్రచారంలో బిజేపీని మించిన పార్టీ ఏది లేదు. అడగకుండానే అన్నీ ఇచ్చిన మహానుభావుడు కేసీఆర్. ప్రజలంతా బీజేపీ దుష్ప్రచారాన్ని నమ్మకుండా టీఆర్ఎస్‌కే అండగా నిలిచి కారుగుర్తుకు ఓటేయాలన్నారు మంత్రి గంగుల.దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు దళితబంధును ప్రవేశపెట్టి వారిని ఆర్థికంగా ఎదగనిచ్చేందుకు చూస్తుంటే బీజేపీనేత ఈటల రాజేందర్‌లు మాత్రం దళితబంధును ఈసీకి లేఖ రాసి మరీ ఆపించారని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బాధ్యతగల ఎంపి పదవిలో ఉండి బండి సంజయ్ పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నాడు.

ఆయన మాటలు దళితులు ఎవరూ విశ్వసించరు. టీఆర్ఎస్ పార్టీ ఆపేది ఉంటే పదకొండు వేల మంది అకౌంట్ లలో డబ్బులు ఎలా వెస్తదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి సభ పెట్టకుండా అడ్డుకున్నది బిజేపీ కాదా అని నిలదీశారు. సీఎంసభ పెడితే జన ప్రభంజనం వస్తుందని భయపడి సభను అడ్డుకున్నారని, కానీ ప్రజలంతా సీఎంవైపే ఉన్నారన్నారు. ప్రజలకు టిఆర్ఎస్ ప్రభుత్వం ఏం తక్కువ చేసింది? గర్వంగా ఓట్లు అడిగే హక్కు మాకే ఉంది. మరీ బీజేపీ వాళ్లు ఏంచేశారని మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. నియోజకవర్గంలో టీఆర్ఎస్ ప్రభంజనాన్ని తట్టుకోలేక ఓటమి భయంతో ఫ్రస్ట్రేషన్‌లో ఉన్న బీజేపీ, ఈటల రాజేందర్‌లు దుష్ప్రచారాలు చేస్తున్నారని ప్రజలు మాత్రం టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌కే ఓటు వేసి గెలిపిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగు లింగయ్యయాదవ్, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, శాట్స్ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదప్రజల సంక్షేమమే టీఆర్ఎస్ ఎజెండా : సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

హుజురాబాద్, అక్టోబర్ 27:తెలంగాణ రాష్ట్రంలో పేదరికమే గీటురాయిగా ..పేదప్రజల సంక్షేమమే ఎజెండాగా టీఆర్ఎస్ పార్టీ పని చేస్తుం దని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. మండలంలోని కనపర్తి గ్రామంలో బుధవారం సండ్ర వెంకట వీరయ్య ఎన్నికల ప్రచారంలో భాగంగా వీధుల గుండా ర్యాలీ తీసి , ఇంటింటికి తిరుగుతూ, గ్రామస్థులతో మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో పేద ప్రజలకు ఎన్నో రకాల సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఏళ్ళతరబడి దళితులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని గుర్తించి పవిత్ర ఆశయంతో అభినవ అంబేద్కర్‌గా ఆలోచన చేసి దళిత బంధు పథకాన్ని తీసుకువచ్చారన్నారు.

ఇప్పటికే కొంతమందికి పథకానికి సంబంధించి డబ్బులు అందాయని, మరికొందరికి బ్యాంక్ అకౌంట్‌లో జమచేయడం జరిగిందని తెలిపారు. ఓడిపోతామనే భయంతో ఈటల రాజేందర్ , బీజేపీ పార్టీ నాయకులు కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసి ఆపించి తాత్కాలిక ఆనందం పొందుతున్నారని..నవంబర్ 4 నుండి మళ్ళీ పథకం అమలవుతుందన్నారు.

హుజూరాబాద్ నియోజకవర్గ దళిత ప్రజలు దళిత బంధుతో ఆర్థికంగా ఎదిగి రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.దళితుల కోసం రూ.50 వేలతో ప్రారంభమయిన కళ్యాణ లక్ష్మి పథకం రూ. ఒక లక్షా నూటపదహార్లకు పెంచి అన్ని వర్గాల వారికి ఏ విధంగా అందజేస్తున్నారో అదే మాదిరిగా దళిత బంధు కూడా రానున్న రోజుల్లో సీఎం కేసీఆర్ అన్ని కులాల, మతాల పేదలకు అందించనున్నట్లు పేర్కొన్నారు.

పథకాల అమలులో టీఆర్ఎస్ పార్టీ ముందుకు పోతుంటే ధరలు పెంచుతూ బీజేపీ పార్టీ పేదలను ఆర్థికంగా వెనక్కి నెట్టుతుందని అన్నారు. ఈ హుజూరాబాద్ ఎన్నిక ఇద్దరు వ్యక్తుల మధ్య కాదని, సంక్షేమం వైపు నడిపిస్తున్న టీఆర్ఎస్ పార్టీకి..సంక్షేభం వైపు ప్రజలను నడిపిస్తున్న బీజేపీ పార్టీ మధ్య జరుగుతున్న ఎన్నికగా ప్రజలు గమనించాలని కోరారు.

ఈ రోజు స్వార్థం కోసం ఈటల రాజేందర్ బీజేపీ పార్టీలో చేరారని, ఈటల రాజేందర్‌ను వ్యక్తిగా కాకుండా బీజేపీ పార్టీగా చూడాలని, దళిత వ్యతిరేక వ్యక్తిగా చూడాలని అన్నారు. పేద ప్రజల అభివృద్ధి కోసం పని చేస్తున్న టీఆర్ఎస్ పార్టీకి ప్రజలు అండగా ఉండాలని , హుజూరాబాద్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బండి సంజయ్ ఎంపీగా గెలిచి రెండున్నర సంవత్సరాలు పూర్తయినా ఏనాడైనా వచ్చాడా.. ఒక్క రూపాయయినా తీసుకువచ్చి పని చేశాడా..ఈటల రాజేందర్‌కు ఓటు వేస్తే ఏమి జరుగుతుందో ప్రజలు ఆలోచన చేయాలని కోరారు.

అభివృద్ధికి వ్యతిరేకంగా పని చేస్తున్న, ఎల్ఐసీ ని, అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్న , రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్ర చేస్తున్న బీజేపీ పార్టీకి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. స్థానిక నాయకులు గడపగడపకు తిరుగుతూ టీఆర్ఎస్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, కారు గుర్తుకు ఓటు వేసి గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్‌విండో చైర్మన్ మాడ సాదవరెడ్డి, సర్పంచ్ పర్లపెల్లి రమేష్, గ్రామశాఖ అధ్యక్షుడు శశికుమార్, ఏఎస్ఆర్ యువసేన శ్రీనివాస్రెడ్డి, విజయ్, వినయ్, కోల శ్రీనివాస్, రాకేశ్, మల్లేశ్, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు తిరుపతి, కవిత, అనూష, నర్సయ్య, బొందయ్య, సందీప్, కోమల్‌రెడ్డి, వెంకటేశ్, పులి ప్రకాశ్, స్పేన్, తదితరులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీలో త్వరలో మరో 32 బస్తీ దవాఖానాలు..!

హైదరాబాద్ , అక్టోబర్ 27: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలోని బస్తీల్లో నివసించే నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటున్న విషయం విదితమే. ఈ చర్యల్లో భాగంగానే నగరంలోని పలు బస్తీల్లో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నారు.

ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో 226 బస్తీ దవాఖానాలు అందుబాటులో ఉన్నాయి. వీటికి తోడుగా మరో 32 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొత్త వాటితో బస్తీ దవాఖానాల సంఖ్య 258కి చేరుకోనుంది. మొత్తం 300 బస్తీ దవాఖానాల ఏర్పాటుకు బల్దియా నిర్ణయించింది. ప్రస్తుతం బస్తీ దవాఖానాల్లో 60 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు.

## ఫ్రాన్స్‌కు బయల్దేరిన మంత్రి కేటీఆర్ బృందం

హైదరాబాద్ , అక్టోబర్ 27: తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ బృందం బుధవారం ఉదయం ఫ్రాన్స్‌కు బయల్దేరింది. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో జరగనున్న పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంత్రి కేటీఆర్ బృందం పాల్గొననుంది. ఫ్రెంచ్ సెనేట్‌లో జరిగే యాంబిషన్ ఇండియా 2021 కార్యక్రమంలో ఈ నెల 29న మంత్రి కేటీఆర్ కీలకోపన్యాసం చేయనున్నారు. పలువురు ఫ్రెంచ్ పారిశ్రామికవేత్తలు, సీఈవోలతో కేటీఆర్ సమావేశం కానున్నారు. కేటీఆర్‌తో పాటు ప్రతినిధి బృందంలో ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

## చైనాది ఏకపక్ష నిర్ణయం.. : భారత్

న్యూఢిల్లీ, అక్టోబర్ 27:చైనా ఆమోదించిన కొత్త భూ సరిహద్దు చట్టం (శ్రీజీనిట ఎనీతీటవతీ శ్రీజిలి)పై స్పందించిన భారత విదేశాంగ శాఖ.. ఇది ఏకపక్ష నిర్ణయంగా అభివర్ణించింది. సరిహద్దు నిర్వహణతో పాటు సంబంధిత సమస్యలు, ప్రస్తుత ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని, ఇరు దేశాల మధ్య ఎల్ఏసీ వెంట సరిహద్దు వివాదం అపరిష్కృతంగా ఉండడం భారత్‌కు ఆందోళనకరమని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ బుధవారం పేర్కొంది. ఈ మేరకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి బుధవారం ప్రకటన విడుదల చేశారు.

ఇలాంటి ఏకపక్ష చర్యల ప్రభావం ఇప్పటికే ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందాలపై ఉండబోదన్నారు. ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదంపైన అయినా, సరిహద్దు ప్రాంతాల్లోని వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి ప్రశాంతత, శాంతి, సామరస్యాల నిర్వహణపైన అయినా ఈ కొత్త చట్టం ప్రభావం ఉండబోదని వివరించారు. సరిహద్దు ప్రాంతాల్లో పరిస్థితిని ఏకపక్షంగా మార్చగలిగే ఏదైనా చర్యను ఈ కొత్త చట్టం సాకుతో చేపట్టడం చైనా మానుకుంటుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

## కేరళలో కరోనాతో 41 మంది గర్భిణీలు మృతి.. 149 మంది సూసైడ్

తిరువనంతపురం: కరోనా సెకండ్ వేవ్ కేరళ రాష్ట్రాన్ని బాగా ప్రభావితం చేసింది. ఎంతో మంది జీవితాలను ఛిన్నాభిన్నం చేసింది. కరోనా బారినపడిన వారిలో 41 మంది గర్భిణీలు మరణించినట్లు ఆ రాష్ట్ర వైద్య మంత్రి వీణా జార్జ్ తెలిపారు. వైరస్ సోకిన వారిలో 149 మంది ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. బుధవారం కేరళ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంత్రి వీణా జార్జ్ ప్రశ్నోత్తరాల సమయంలో సభకు వెల్లడించారు. కాంగ్రెస్ శాసనసభ్యుడు టీజే వినోద్ అడిగిన ఒక ప్రశ్నకు ఆమె ఈ మేరకు సమాధానం ఇచ్చారు. 'జిల్లాల నుండి అందిన గణాంకాల ప్రకారం, రాష్ట్రంలో 41 మంది గర్భిణీలు కరోనాతో చికిత్స పొందుతూ చనిపోయారు. వైరస్ బారినపడిన 149 మంది రోగులు ఆత్మహత్య చేసుకున్నారు' అని ఆమె పేర్కొన్నారు.

మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే మాథ్యూ కుజల్‌నాదన్ అడిగిన ప్రశ్నకు వైద్య మంత్రి వీణా జార్జ్ బదులిచ్చారు. రాష్ట్ర జనాభాలో 17 శాతం మందికి ఇప్పటికీ కరోనా ముప్పు ఉన్నదని ఐసీఎంఆర్ నిర్వహించిన సెరో సర్వే ద్వారా తెలుస్తున్నదని చెప్పారు. రెండు డోసుల వ్యాక్సిన్ తీసుకున్న వివిధ వర్గాల ప్రజలలో అత్యధిక సెరో ప్రాబల్యం రేటు తీరప్రాంత ప్రజలలో-93.3 శాతం ఉన్నట్లుగా సర్వేను ఉటంకిస్తూ మంత్రి వెల్లడించారు.

## గోప్యత హక్కును కాపాడుకోవడం ముఖ్యం: సుప్రీం

న్యూఢిల్లీ, అక్టోబర్ 27:దేశంలో తీవ్ర దుమారం రేపిన పెగాసస్ స్పైవేర్ వ్యవహారంపై సుప్రీంకోర్టు నిపుణుల కమిటీని ఏర్పాటుచేసింది. పెగాసస్ వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తు చేయించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ నేతృత్వంలోని ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ముగ్గురు సభ్యులతో కూడిన నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. దీనికి సుప్రీంకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ ఆర్వీ రవీంద్రన్ నేతృత్వం వహిస్తారని, అలోక్ జోషి, సందీప్ ఒబెరాయ్ కమిటీలో సభ్యులుగా ఉంటారని తెలిపింది. కమిటీ పనితీరును పర్యవేక్షిస్తామని వెల్లడించింది.

గోప్యత హక్కును కాపాడుకోవడం ముఖ్యమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పెగాసస్ వ్యవహారంలో గోప్యత హక్కు ఉల్లంఘన జరిగిందా లేదా అనేది కమిటీ పరిశీలిస్తుందని తెలిపింది. పౌరులపై నిఘాలో విదేశీ ఏజెన్సీల ప్రమేయంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుందని వ్యాఖ్యానించింది. ఆరోపణలపై క్షుణ్ణంగా పరిశీలించి ఎనిమిది వారాల్లో నివేదిక ఇవ్వాలని కమిటీని ఆదేశించింది. కాగా, కమిటీ ఏర్పాటు చేస్తామన్న కేంద్రం ప్రతిపాదనను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. జాతీయ భద్రత పేరుతో బాధ్యతల నుంచి తప్పించుకోలేరని వ్యాఖ్యానించింది.

## గవర్నర్ తమిళిసైని కలిసిన నావికాదళం అధికారులు

హైదరాబాద్ , అక్టోబర్ 27:భారత నావికా దళానికి చెందిన పలువురు అధికారులు ఇవాళ తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిలో వైస్ అడ్మిరల్ అజేంద్ర బహదూర్‌సింగ్‌తోపాటు ఏవీఎస్ఎం, వీఎస్ఎం, ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ ఈస్టర్న్ నావల్ కమాండ్‌తోపాటు ఇతరులు ఉన్నారు. వీళ్లంతా రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌తో భేటీ అయ్యారు. రాజ్‌భవన్ ప్రెస్ సెక్రెటరీ ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి : ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి

పెద్దపల్లి, అక్టోబర్ 27:: ఉపాధ్యాయుల సమస్యలు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి అన్నారు.

జిల్లాలోని జడ్పీఎచ్ఎస్ ఎక్లాస్ పూర్ పాఠశాలలో ఉచిత సోలార్ స్టడీ లాంప్స్, ఫ్యాన్లు, పుస్తకాల పంపిణీ కార్యమానికి అతిథిగా హాజరయ్యారు.

పాఠశాలకు ఎమ్మెల్సీ నిధుల నుంచి లైబ్రరీ, నాలుగు లక్షల రూపాయలతో పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

మంథని ఎమ్మార్సీకి ప్రహరీ గోడను మంజూరు చేశారు.

అదే విధంగా పెద్దపల్లి జిల్లాలోని ఏ ప్రభుత్వ పాఠశాలకు మౌలిక వసతుల సమస్యలైన తన దృష్టికి తీసుకువస్తే వెంటనే తసమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.

కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, ఎం పి పి కొండా శంకర్ జడ్పీటీసీ తగరం సుమలత, పాక్స్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, మంథని మండల విద్యాధికారి లక్ష్మి, పీఆర్టీయూఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రు సురేష్, గండు కృష్ణమూర్తి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ చలువాజి నాగేశ్వర్ రావు, గ్రామ సర్పంచ్ చెన్నవేన సదానందం, ఎంపీటీసీ చైతన్య ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లెల అభివృద్ధితోనే దేశాభివృద్ధి : సందీప్ కుమార్ సుల్తానియా

సంగారెడ్డి, అక్టోబర్ 27:: పల్లెలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. బుధవారం నదాశివపేట మండల పరిధిలోని కోనాపూర్ గ్రామాన్ని సందర్శించారు.

గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లెప్రగతి వనం, డంపింగ్ యార్డు, వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాలను పరిశీలించారు. పల్లెప్రకృతి వనంలో మొక్కలు నాటారు. అనంతరం సందీప్‌కుమార్ సుల్తానియా మాట్లాడుతూ.. పల్లెలు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. పల్లెలు పరిశుభ్రంగా ఉంచి అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ పల్లెప్రగతి కార్యక్రమం తీసుకువచ్చారన్నారు.పల్లెప్రగతి కార్యక్రమం ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి అధికారులు, ప్రజాప్రతినిధులు అన్ని వర్గాల సలహాలు తీసుకుని బృహత్తరమైన కార్యక్రమం తీసుకువచ్చారన్నారు. పల్లెప్రగతి కార్యక్రమం నాలుగో విడత పూర్తి చేశామన్నారు. వాటి ద్వారా పల్లెలు అభివృద్ధి చెందడంతో పాటు పారిశుద్ధ్యం మెరుగుపడిందన్నారు.పల్లెప్రగతి కార్యక్రమం నిరంతరాయంగా ఉంటుందని, ప్రతి రోజు మన ఇళ్లను శుభ్రం చేసుకున్నట్లే గ్రామాన్ని శుభ్రం చేయాలని సూచించారు. గ్రామ అభివృద్ధి కోసం సర్పంచ్‌లకు నిబంధనలు తీసుకొచ్చామని, విధుల్లో నిర్లక్ష్యం చేసిన వారి పదవులు పోతాయన్నారు.కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాజర్షి షా, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్‌డీఓ శ్రీనివాస్ రావు, డీపీఓ సురేష్‌మోహన్, ఏపీడీ జయదేవ్, డీఎల్‌పీఓ సతీష్‌రెడ్డి, పీఆర్ ఈఈ జగదీశ్వర్, ఎంపీడీఓ పూజా, ఎంపీఈఓ నారాయణ, కోనాపూర్ గ్రామ సర్పంచ్ శోభారాణి, ఎంపీటీసీ లలిత, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచానికి పొంచి ఉన్న పర్యావరణ ముప్పు : ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి

హైదరాబాద్ , అక్టోబర్ 27:వాతావరణ మార్పులతో ప్రపంచానికి పర్యావరణ ముప్పు పొంచి ఉందని ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ పురుషోత్తం రెడ్డి హెచ్చరించారు. స్కాట్లాండ్‌లోని గ్లాస్కో నగరంలో ఈనెల 31 నుంచి నవంబర్ 12 వరకు జరిగే కాప్ 26 సదస్సు జరుగనుంది.

ఆ సదస్సులో పాల్గొనే 194 దేశాలు వివిధ అంశాలపై జరిగే చర్చలు, ఒప్పందాల సమాచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలనే లక్ష్యంతో రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్నాస్ పల్లిలో మంగళవారం ఎర్త్ సెంటర్‌లో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా పర్యావరణ శాస్త్రవేత్తలు డాక్టర్ తులసీ రావు, డాక్టర్ సాయిభాస్కర్, డాక్టర్ ఉమా మహేశ్వర్ రెడ్డి, మాజీ సమాచార హక్కు కమిషనర్ దిలీప్ రెడ్డి, ఎర్త్ సెంటర్ చైర్మన్ లక్ష్మారెడ్డి, అధ్యక్షురాలు లీలారెడ్డి తదితరులతో కలిసి పురుషోత్తం రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుతం పెరిగిన 2 డిగ్రీల భూతాపంతో ప్రపంచం వ్యాప్తంగా పెను విపత్తులు సంభవించాయని పేర్కొన్నారు. పలు దేశాలు తగలబడిపోయాయన్నారు.

చాలా కాలంగా చోటు చేసుకుంటున్న పర్యావరణ విధ్వంస ఫలితమే కరోనా వంటి మహమ్మారికి కారణమన్నారు. పర్యావరణ విధ్వంసం వల్ల ప్రపంచంలోని పలు లోతట్టు దేశాలు, నగరాలు ముంపుకు గురవుతాయని, ఆ జాబితాలో బంగ్లాదేశ్, ముంబాయి, కోల్‌కతా, చెన్నై, విశాఖ, కాకినాడ వంటి పట్టణాలు ఉన్నాయని డాక్టర్ తులసీరావ్ హెచ్చరించారు.

ఇలాంటి ప్రమాదాలను అరికట్టేందుకు కాప్-26 వేదికగా పలు కఠిన నిర్ణయాలు తీసుకుంటారని, వాటిని క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేసేలా ఎర్త్ సెంటర్ 12 రోజులు పలు కార్యక్రమాలను నిపుణులతో నిర్వహించనున్నట్లు దిలీప్ రెడ్డి తెలిపారు. గ్లాస్కోలో జరిగే చర్చల అంశాలను ఎప్పటికప్పుడు విశ్లేషించి ఎర్త్ సెంటర్ ద్వారా ప్రజలకు అందిస్తామని డాక్టర్ సాయి

## మంత్రి వేముల సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరికలు

నిజామాబాద్, అక్టోబర్ 27: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి టీఆర్ఎస్‌లో పెద్ద ఎత్తున చేరుతున్నారు. తాజాగా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు భూక్య చంద్రునాయక్(కారేపల్లి, భీంగల్ మండలం) తన అనుచరులతో కలిసి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.

వారికి గులాబీ కండువా కప్పి మంత్రి పార్టీలోకి మంత్రి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. మన మంతా ఒకే గొడుగు కిందకు చేరి కేసీఆర్‌కు మద్దతుగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

**చరిత్రలో నేటినిజం**

కం॥ కంటిని-మదిలో కొడవటి
గంటిని-నవలలను గ్రాలు కాత్యాయనమద్దున్
గంటిని-కుటుంబరావున-
కంటినిఅలంటిని గలపిడి కథిలాఘనార్థన్!!

(అక్టోబర్ 28 నవలా రచయిత కొడవటిగంటి కుటుంబరావు జయంతి..)

–రాధశ్రీ
సెల్: 9494481210

నేటినిజం
# సాహితీ కైరవాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com



## నేటికవిత-కవిత్వ విశ్లేషణ

-శ్రీదాసం లక్ష్మయ్య
అడ్మిన్, నేటికవిత
9440155240

నేటికవితలో ఈ వారం: 'నేను నదినైతే..'
అనే అంశంపై వచ్చిన కవితల్లోంచి ఓ మూడు కవితలపై విశ్లేషణ

-దాసం సేనాధిపతి
కవిత్వ విశ్లేషకులు
9440525544

### నదిగా జీవిస్తే

జనన మరణాల మధ్య
ఎత్తుపల్లాలెన్ని దాటానో
తీపి చేదులెంత మింగాను
ఎందరి ఆసరా ఆయువుగా పొందాను
ఎన్ని ప్రాణులను చెట్లుగా పెంచానో
కాలుష్యం ఎంత దిగమింగాను
నదిగా మారడమంటే తమాషానా.
వాగులు వంకలెన్ని ప్రాణ సిరలుగా మారితే
రూపం కోల్పోయిన దాతలైతే
నదిలా నా నడక మొదలైంది
ఆ తల్లుల పేరు చెడగొట్టకపోవడమే సార్థకత.
నది అంటే సారవంతమైన జీవితం
జీవాక్షరాల పుట్టుక, గమనం
చరిత్ర సాగుఏసే నాగలి
అద్భుతాల అడవులు,
పల్లెలు, పట్నాలను పెంచే తల్లి ఒడి
కడుపులో దాహం తీర్చి, చర్మం చెమట కడిగేసి
సేద్యపు కన్నీళ్లు తుడిచేది
మనిషికి నాగరికత నేర్పింది
నది జీవన చైతన్యమే.
కొన్ని ఓర్వలేని కళ్లుంటాయి
కుళ్లుకునే చేష్టలుంటాయి
నోరులేని జీవి కదా నది అని
మలమూత్రాదుల కడిగేసుకుంటాయి
వ్యర్థాలు గుట్టుగా వదిలేస్తుంటాయి
నది తిరగబడితే, పొంగి పొర్లి దాడి చేస్తే
నామరూపాలు
నాశనమవుతాయని తెలియదేమో.
నేను నదినైతే
పారినంత కాలం జీవనం ఉరిగిపోని పుస్తకం
ఎండిపోయి ఇసుకగా మారినా
నిర్మాణాల మూలం
మరిన్ని నదులను కలుపుకున్న సంగమం
భూమ్మీద ఉన్నంత కాలం నది ప్రాణదాత
సముద్రంలో కలిస్తే కన్నీటి గోస

-కొమురవెల్లి అంజయ్య
9848005676

సిద్దిపేటకు చెందిన కవి కొమురవెల్లి అంజయ్య గారు నేను నదినైతే.. అంశంపై నదిగా జీవిస్తే శీర్షికతో రాసిన కవిత ఆద్యంతం ఆలోచనాత్మకంగా మలచబడింది.

నదిని ఉన్నతంగా చిత్రిస్తూ కవి అంజయ్య గారు రాసిన పంక్తులు అందరినీ ఇట్టే ఆకట్టుకుంటాయి. నదిగా మారడమంటే తమాషాకాదనీ.. మనిషికి నాగరికత నేర్పింది నది జీవన చైతన్యమేనని తేల్చిచెప్పిన తీరు బాగుంది. జనన మరణాల మధ్య ఎత్తుపల్లాలను ఎన్నింటినో తీపి చేదులెంత మింగాను... ఎందరి ఆసరా ఆయువుగా పొందాను.. ఎన్ని ప్రాణులను చెట్లుగా పెంచానో.. కాలుష్యం ఎంత దిగమింగాను అంటూ ప్రారంభపంక్తుల్లోనే .. నదిగా జీవించడం అంత సులభమైంది కాదని వివరించారు.

వాగులు వంకలెన్ని ప్రాణసిరులుగా మారితే రూపం కోల్పోయిన దాతలైతే నదిలా నానడక మొదలైందని.. ఆ తల్లుల పేరు చెడగొట్టక పోవడమే సార్థకత అని చెప్పడం ద్వారా నదీమతల్లి ఆవిర్భావాన్ని నర్మగర్భంగా ఆవిష్కరించడమే కాక ..నదిగా జీవించడంలోని కర్తవ్యాన్ని ప్రబోధించారు.

నది అంటే సారవంతమైన జీవితమనీ.. జీవాక్షరాల పుట్టుక, గమనం, చరిత్ర సాగుచేసే నాగలి అద్భుతాల అడవులు, పల్లెలు, పట్నాలను పెంచే తల్లి ఒడి.. అంటూ నది వల్ల ఒనగూరే ప్రయోజనాలను.. కవి చెప్పకనే చెప్పారు.

కడుపులో దాహం తీర్చి, చర్మం, చెమట కడిగేసి సేద్యపు కన్నీళ్లు తుడిచేది.. మనిషికి నాగరికత నేర్పించి నదీజీవన చైతన్యమేనని రాసిన పంక్తులు కవితాశీర్షికకు పుష్టిని కూర్చాయి. కొన్ని ఓర్వలేని కళ్లుంటాయి.. కుళ్లుకునే చేష్టలుంటాయి..నోరులేని జీవి కదా.. నది అని వ్యర్థాలు గుట్టుగా వదిలేస్తుంటాయి... నది తిరగబడితే పొంగిపొర్లి దాడిచేస్తే నామరూపాలు నాశనమవుతాయని తెలియదేమోనంటూ..నదియొక్క శక్తిని తెలియజెప్పారు.. నేను నదినైతే.. పారినంత కాలం.. జీవనం చెరిగిపోని పుస్తకమనీ.. ఎండిపోయి ఇసుకగా మారినా.. నిర్మాణాలమూలం.. మరిన్ని నదులను కలుపుకున్న సంగమం.. భూమ్మీద ఉన్నంతకాలం నది ప్రాణదాత.. సముద్రంలో కలిస్తే కన్నీటి గోస అంటూ .. కవి తాత్వికతతో రాసిన భావాలు బాగున్నాయి. నదియొక్క ప్రాశస్త్యాన్ని మానవ జీవనంతో సమన్వయ పరుస్తూ.. మనిషి యొక్క బాధ్యతలను గుర్తుచేశారు. నదిలా పదిమందికి ఉపయోగపడేలా జీవనం కొనసాగిస్తే బ్రతుకు సార్థకమవుతుందన్న అర్థాన్ని నర్మగర్భంగా కవి అంజయ్యగారు తెలియజెప్పారు.

### నేను నదినైతేనే కదా!

కొండలు లోయల్లో పరుగులు తీసేవేళ
తాకిన గాయాలను భరిస్తూనే
ప్రపంచ దేహంలో హరిత చైతన్యం ఒంపి
హరివిల్లు అందాలను ఆరబోయగలిగింది
నేను నదినైతేనే కదా!.
పసిపిల్లల రూపాన్ని ధరించి
పాయలు పాయలుగా
కేరింతలు కొడుతూ ప్రవహించి
ఆకుపచ్చని పంటపొలాలకు
పాలధారలను తాపించి
అన్నదాతల కన్నుల్లో
ఆనందాల వెన్నెల్లు నింపింది
నేను నదినైతేనే కదా!.
మూగజీవాలకు
మురిపాల జీవితం ఇచ్చేందుకు
అడుగిడిన చోటంతా
ఆకలిదప్పికలు తీర్చే అమ్మైంది.
సమీక్యతా బీజాలు నాటేందుకు
సరిహద్దులు చెరిపేసి సాగిపోతూ
పుణ్యక్షేత్రాలకు పురుళ్లు పోసింది.
ఆకాశ గంగమ్మను ఒడిలో దాచుకుని
ఆనకట్టలలో పరుగులు ఆపుకుంటూ
సమస్త మానవాళికి కడుపు నిండుగా నింపింది.
వేదనల చీకటి గాథలను గుండెలో దాచుకుని
గుట్టు విప్పకుండా
అమ్మంత పెద్ద మనసుతో
మౌనంగా భరించేది
నేను నదినైతేనే కదా..

-పురిమళ్ల సునంద
9441815722

ఖమ్మంకు చెందిన కవయిత్రి పురిమళ్ల సునంద గారు నేను నదినైతే.. అంశంపై నేను నదినైతేనే కదా శీర్షికతో రాసిన కవితలో వేదనల చీకటి గాథలను గుండెలో దాచుకుని గుట్టు విప్పకుండా అమ్మంత పెద్దమనసుతో భరించడం సాధ్యమవుతుందని పేర్కొని నదియొక్క ప్రాముఖ్యతను ఆవిష్కరించిన తీరు బాగుంది.

నేను నదినైతేనే కదా.. కొండలు.. లోయల్లో పరుగులు తీసేవేళ తాకిన గాయాలను భరిస్తూనే.. ప్రపంచ దేహంలో హరిత చైతన్యం ఒంపి హరివిల్లు అందాలను ఆరబోయగలను అంటూ జీవిత గమనంలో కష్టాలను భరిస్తూనే పదిమందికి ప్రయోజనం చేకూరేలా మారగలనన్న అర్థం ధ్వనించే విధంగా కవయిత్రి సునందగారు కొనసాగించారు.

నేను నదినైతేనే కదా.. పసిపిల్లల రూపాన్ని ధరించి పాయలు పాయలుగా కేరింతలు కొడుతూ ప్రవహించి ఆకుపచ్చని పంటపొలాలకు పాలధారలను తాపించి.. అన్నదాతల కన్నుల్లో ఆనందాల వెన్నెల్లు నింపగలిగేది అంటూ నదియొక్క ఔన్నత్యాన్ని తెలియజేశారు. నదినైతేనేకదా.. మూగజీవాలకు మురిపాల జీవితం యిచ్చేందుకు అడుగిడిన చోటంతా ఆకలి దప్పులు తీర్చే అమ్మనయ్యేది అంటూ కొనసాగించిన తీరు బాగుంది. కవయిత్రి సునంద గారు ఇంకా నదీమతల్లి గొప్పతనాన్ని ఇలా ఆవిష్కరించారు.

సమైక్యతా బీజాలు నాటేందుకు సరిహద్దులు చెరిపేసి.. సాగిపోతూ.. పుణ్యక్షేత్రాలకు పురుళ్లు పోయాలంటే నదిగా మారితేనే వీలయ్యేదంటూ వివరించారు. ఆకాశ గంగమ్మను ఒడిలో దాచుకుని .. ఆనకట్టలలో పరుగులు ఆపుకుంటూ.. సమస్త మానవాళికి కడుపునిండుగా నింపాలంటే నదిగా మారితేనే వీలయ్యేదని తెలియజేసిన తీరు బాగుంది. నేను నదినైతేనే కదా.. వేదనల చీకటి గాథలను గుండెలో దాచుకుని గుట్టు విప్పకుండా అమ్మితే పెద్ద మనసుతో మౌనంగా భరింగలిగేది అంటూ ముగించిన తీరు బాగుంది.

తాను నదిగా మారితే.. అమ్మలా ఎలా సమాజానికి మంచిని ప్రసాదించగలరో చక్కని విశ్లేషణతో కవయిత్రి సునంద గారు ప్రకటించిన భావాలు కవితలో చక్కగ ఒదిగిపోయాయి.

### కాలుష్యాన్ని ఆపుతాను

ఓ గంగా ...
నువ్వెప్రాంతమేగినా
ఎందుకాలిడినా
మనుషుల పాపాలను
శ్రాద్ధ కర్మలను ప్రక్షాళనం చేసి
పునీతులను చేసేది నీవే కదా!.
గంగా, గోదావరి, తుంగభద్ర
కృష్ణా, యమున, సరస్వతి
వంటి జీవనదులు
పుణ్యతీర్థాలకు పుష్కరాలకు నిలయమై
సాక్షాత్కరిస్తున్నాయి.
తమ పాపాలను ప్రక్షాళనం
చేసుకోవడానికి వచ్చిన మనిషి
నీ గంగాజలాన్ని కూడా
కలుషితం చేయడానికి వెనుకాడలేదు
తాగే నీటిని సైతం కలుషితం చేస్తూ
తమకు తామే ప్రాణసంకటాలను
కొనితెచ్చుకోవడం శోచనీయం.
భగవంతుడు సైతం
జీవకోటి నిన్నాశ్రయించి
మనుగడ సాగిస్తున్నారు
నిన్ను కలుషితం చేయ తగునా?
అయినా నోరు విప్పని
నీ సహనానికి నా జోహార్లు
అదే నేనే నదినైతే..
కాలుష్యాన్ని తప్పక ఆపుతాను.

-రాయవరపు సరస్వతి
7989665525

విశాఖ జిల్లా చోడవరంకు చెందిన కవయిత్రి రాయవరపు సరస్వతి గారు నేను నదినైతే.. అంశంపై కాలుష్యాన్ని ఆపుతాను శీర్షికతో తమ కవితను తీర్చిదిద్దారు. నేను నదినైతే కాలుష్యాన్ని తప్పక ఆపుతానని సరస్వతిగారు ప్రకటించడం ప్రశంసనీయం.

ఓ గంగా! నువ్వే ప్రాంతమేగినా.. ఎందు కాలిడినా.. మనుషుల పాపాలను శ్రాద్ధకర్మలను ప్రక్షాళనం చేసి పునీతులను చేసేది నీవే కదా అంటూ ప్రారంభంలోనే కవయిత్రి నది యొక్క గొప్పతనాన్ని వివరించ యత్నించారు. గంగా, గోదావరి, తుంగభద్ర, కృష్ణా, యమున, సరస్వతి వంటి జీవనదులు పుణ్యతీర్థాలకు పుష్కరాలకు నిలయమై సాక్షాత్కరిస్తున్నాయని కొనసాగించారు.

పుణ్యతీర్థాలకు, పుష్కరాలకు నిలయమై సాక్షాత్కరిస్తున్న నదులను మనిషి తమ పాపాలను ప్రక్షాళన చేసుకునేందుకు వెనుకాడటం లేదని పేర్కొన్నారు. అంతేకాక మనిషి తాగే నీటిని సైతం కలుషితం చేస్తున్న వైనాన్ని గుర్తుచేశారు.స్వయంకృతంతో మనిషి నీటిని కాలుష్యపరుస్తూ అనారోగ్యాలను కొనితెచ్చుకుంటున్నాడని వ్యాఖ్యానించారు. నదీమతల్లి సహనంతో అనేక కష్టాలననుభవిస్తుందన్న అర్థం ధ్వనించేవిధంగా .. కవయిత్రి ప్రస్తావించే ప్రయత్నం చేశారు.

భగవంతుడు మరియు మనిషి నిన్ను జీవకోటి నిన్నాశ్రయించి మనుగడ సాగిస్తున్నారనీ.. అయినా కలుషితం చేయడం తగునా? అని ప్రశ్నించారు. నోరు విప్పని నీ సహనానికి జోహార్లు అంటూ కొనసాగింఆరు. అదే నేనైతే కాలుష్యాన్ని తప్పక ఆపుతాను అంటూ ముగించారు. వస్తు విశ్లేషణలో.. అభివ్యక్తిలో ఇంకా సమన్వయం పాటిస్తే బాగుండేదనిపించినప్పటికీ.. నదిగా కాలుష్యాన్ని ఆపుతానని ప్రకటించడం ప్రశంసనీయం. అయితే కవయిత్రి తాము నది అయితే కాలుష్యం ఎలా ప్రక్షాళన చేయగలరో వివరిస్తే బాగుండేది. కవితలో వచనం డామినేట్ చేసినప్పటికీ.. కవయిత్రి యొక్క సంకల్పాన్ని అభినందించి తీరుతాం. శిల్పం.. పదబంధ ప్రయోగంలో ఇంకా శ్రద్ధ వహిస్తే కవయిత్రి గారి కలం నుండి గాఢమైన కవిత్వం జాలువారగలదన్న విశ్వాసం ఉంది. అధ్యయనంపై దృష్టి సారించి కవయిత్రి తాము తమ కలానికి పదును పెట్టుకుంటారని ఆశిద్దాం.

## ఘంటారవం

నైపుణ్యం తగ్గిందని
నీరసపడితే ఎలా
పదును కోల్పోయిన కత్తిని
సానపట్టాలి కదా.
ఎన్ని నదీనదాలు
ఒక మహానది
ఎన్ని జీవితాలు స్పర్శిస్తే
ఈ జీవన జలధి.

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

## ఒక్కో ప్రమాదమూ- ఆనందమే!!

మేం వెతుక్కుంటూ ప్రమాదం దగ్గరకెళ్లామో
మమ్మెతుక్కుంటూ ప్రమాదమే వచ్చిందో కాని
ఈ తెగిపోయిన అవయవాల చుట్టూ
ఓ తీయని జ్ఞాపకం అల్లుకొన్నట్లుంది!
మా స్మృతి పథంలో కొన్ని తీపి గుర్తులు
ముద్దలు ముద్దలుగా అద్దుకొన్నట్లు
తొణికిసలాడే ఉత్తేజం!
మోదువారిన అవయవాలు

మొగ్గతొడిగించే సందర్భాలు
చేదుగాయాలు తీపిస్మృతులై
తల్లిలా తలనిమిరేవి కొన్ని
ప్రేమికుల్లా గుండెల్లో గుసగుసలాడేవి కొన్ని
గతమంతా మా అనుభూతులు
పెనుభూతాలై వెంబడించినా
మా సంతోషాలు సమాజ శిశిరాల్లో రాలిపోయినా
మా కన్నీటి బిందువులు ఆశా బీజాలై మొలకెత్తుతూ..
గుండెల్లో పత్ర హరితాన్ని నింపుతూనే వున్నాయ్!
ఏమో! ఈ తెగిపోయిన అవయవాల్ని
బాధామయంగా మేమెందుకు ఊహించాలి?
ఓ దుర్భర సన్నివేశంగా మేమెందుకు కుమిలిపోవాలి?
మేం విడివిడిగా అనుభవించిన విరహపు వ్యథకన్నా
కలిసి ఒకటిగా అనుభవించే గాయాలే నయం!
ఈ బాధలో ఓ ఆనందం అనుభూతి ఆప్యాయత
ముప్పురికొన్న ఓ నమ్మకం మోసులెత్తుతూ నిలువెత్తు
హృదయంగా ఆవిష్కరింపబడుతున్నప్పుడు..
మోదువారిన అవయవాల మీద
జ్ఞాపకాల వసంతాలు వాలకపోతె
మనిషి మళ్లీ చిగిర్చేదెన్నడు?
జ్ఞాపకాల నదిలో ఉత్తేజపుటలలు తొణికిసలాడకపోతే
మనిషి ఓ సజీవ ప్రవాహమయ్యేదెన్నడు?
అదే నమ్మకంగా మా ఒళ్ళంతా కొత్తరెక్కలు మొలుస్తున్నాయ్
కలిసి బతికిన కొద్దిక్షణాలు
ఈ ప్రపంచాన్ని ముద్దాడినంత ఆనందంగా
అనంతంలోకి ఒకటిగా
ఎగిరిపోతున్నంత హాయ్‌గా..
ఈనాడు నిజంగా
మేం వెతుక్కుంటూ ఆనందమయమైన
ఈ ప్రమాదం దగ్గరకీ వెళ్ళినట్లుంది!!

-కొండ్రెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి
సెల్ 99487 74243

## తంగేడులాంటి ముగ్ధ కవిత్వం...

పుస్తక సమీక్ష

కొందరికి కవిత్వం వెన్నతో పెట్టిన విద్య. బహుశా వీరు అను క్షణం కవిత్వాన్నే శ్వాసిస్తూ, ఆశ్వాసిస్తూ, మనగలుగుతుంటారు. ఒక ఆలోచన తటిల్లున మెరవగానే వారి మేధో మంజూషలో నిక్షిప్తం చేసుకుంటారు. ఇక ఎప్పుడు కావలిస్తే అప్పుడు నిక్షిప్తపరిచిన ఆ కవితా సంపదను నలుగురితో పంచుకుంటారు, చింతపట్ల వెంకటరమణాచారి కోనరావుపేట (రాజన్న సిరిసిల్లా జిల్లా) నివాసి. వృత్తి పౌరోహిత్యం. ప్రవృత్తి రచనా వ్యాసంగం మరియు స్వతంత్ర జర్నలిజం (Freelance Writer). సంస్కృతి పరిరక్షణపట్ల అమితమైన శ్రద్ధ చూపుతారు.

సాహితీవేత్తలకు సామాజిక స్పృహ తోటి మనిషిపైనే కాదు, చుట్టూరా ఆవలించిన ప్రకృతి చెట్టూ చేమా, పులుగూ, పక్షులపై కూడా ఉంటుంది. అందువల్లే, సమాజానికి కలిగే సుఖ దుఃఖాలకు మొట్టమొదట స్పందించేది సాహితీకారులే! వారి ఆదర్శ బోధలవల్లే తతిమ్మాజనం ప్రేరేపితులవు తారు. వారి వెంట నడుస్తారు. మహాత్ముడు సాధించిన స్వాతంత్ర్యానికి 'బీజం' వందేమాతరంతో పడిందని లోకవిధితమే!

రచయిత రమణాచారి ఒకే ఒక సంవత్సరకాలం (2020)లో రాసిన శతాధిక కవితలను 'తంగేడు పూలు' అన్న కవితా సంకలనం ద్వారా మనకందిస్తున్నారు. తెలంగాణ ప్రాంతంలో తంగేడుపూలు హంగూ ఆర్భాటం లేక ఆరుబయల్లలో ఎక్కడైనా పూస్తాయి. పసిపాపల్లా అమాయకంగా నవ్వుతూ, గాలికి సయ్యాటలాడుతూ అందుకొమ్మని




ఆహ్వానిస్తాయి. తెలంగాణ ఆడపడుచు బతుకమ్మను పేర్చటానికి తంగేడు గునుగు అత్యవసరం. కవి తన కవితా సంకలనానికి తంగేడు పూలుగా నామకరణం చేయటం ఎంతో సమంజసంగా ఉంది. మొదట ఈ సంపుటికి సుమ సౌరభాలుగా నామకరణం చేయనెంచినా, 'తంగేడుపూలు' అన్న శీర్షిక బాగానప్పింది.

శతాధిక కవితలున్న ఈ సంపుటిలో సింహభాగం కరోనా-19కు సంబంధించినవే అయి ఉండటం విశేషం. ఇది సమకాలిన సంఘటన పట్ల కవికున్న ఆర్తి, వ్యక్తమౌతున్నది. కరోనా వల్ల ఉపాధి కోల్పోయిన పీడితజనాలు, జీవనోపాధి కరువై స్వగ్రామాలకు వందలకి కిలోమీటర్లు కాలి నడకన వెళ్ళిన శ్రామిక జనం, కనోనా బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు ఫస్ట్ వేవ్‌లో పళ్ళాలు కొట్టటం దీపాలు వెలిగించటం లాంటి సంగతులెన్నో కవి కలం ద్వారా చిత్రితమయ్యాయి.

**కరోనాకు మందులేదు నిరోధం ఒక్కటే!**
**ఇళ్ళలోంచి రాకుండా ఉండటమే మంచి దమ్మ!**(పే.12) అని మనల్ని హెచ్చరిస్తూనే
**"విషకణమా!నీ అంతమేమా పంతం!!"** (పే.20) అంటూ నడుం బిగిస్తాడు కవి.

ఒక ఆకతాయి అవాసపంగులో బాంబు ఉంచి ఏనుగుకు అందిస్తే ఆ ఏనుగు మరణిస్తే తన పెంపుడు జంతువు మృతి చెందినంత ఆవేదన పడతారు (పే.41). ఉసిరి ఆరోగ్య ప్రదాయిని అంటాడు (పే.43). చెట్లు (పే.71) చినుకు (పే.88) పర్యావరణం (పే.101) పరిరక్షణకై రణం సలుపుతాడు. బోనాలు సందర్భాన రంగమెక్కి భవిష్యత్తు చెప్పే మాతంగి జీవితం వెనుకగల చీకట్లను తన కవితల వెలుగులతో బయటకు తెస్తాడు (పే.93). వంగపండు ప్రసాదరావు, సినారె, దాశరథి, అల్లురామలింగయ్య, మన పి.వి. నరసింహారావు ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు. రాజశేఖర రెడ్డి ప్రభుతుల ప్రాభవాన్ని చక్కగా వర్ణించాడు. కాదేదీ కవిత కనర్హం అని శ్రీశ్రీ సెలవిచ్చినట్లు వీరి తాతగారి నశ్యం అలవాటు, నశ్యం తయారీ పొగాకు కొమ్మలు ఆరోగ్యపు రెమ్మలే (పే.53) అనటం కవిలోని చతురతకు ప్రతీక.

భాషా సారళ్యత, సూటిదనం, శషభిషలు లేకపోవటం ఉన్నది ఉన్నట్లుగా చెప్పే అమాయకత్వం ఈ కవికి పెట్టని ఆభరణాలు. తన సంపుటికి 'తంగేడు పూలు' అని నామకరణం చేయటం కవి ఆత్మ నైర్మల్యానికి ప్రతీక. తంగేడు పూవులాంటి వీరి స్వచ్ఛమైన మనసుకు అభినందనలు.

**ప్రతులకు:** చింతపట్ల అఖిల్,
పన్నీర్ సెల్వంహైం,
లక్ష్మీనగర్, సూరారం
హైదరాబాద్-55.

**- కూర చిదంబరం**
సెల్: 8639335675

## భల్లం భాష్యం
## కవిత్వం అందరిదీ అనుకోరెందుకో!?!

కవిత్వాన్నే కాదు. కవి జీవితాన్ని కూడా అప్పుడప్పుడూ ప్రశ్నించే హక్కు సమాజానికి ఎప్పుడూ ఉంటుంది. ఒక తాత్త్విక పునాది లేకుండా ఒక దిశా నిర్దేశం లేకుండా కవి తన ప్రస్థానాన్ని ఎలా ముందుకు సాగిస్తాడు..?

ఒక కవి రాజకీయ పరంగా పని చేయదలచుకుంటే అతడు ఆ పార్టీకే సిద్ధాంతానికి నిబద్ధుడు కావాలి. క్రమక్రమ అతనిలోని కవి మాయమవుతూ కార్యకర్త బయటపడ్డాడు. స్వేచ్ఛకు, చైతన్యానికి నిష్పాక్షిక దృష్టికి వీడ్కోలు పలికినట్లే అవుతుంది.

కవులకు ప్రపంచం అంతా కావాలి. ఏ ఒక్కదాన్నీ మనకెందుకులే అని అనుకోరు. ఊరు కోరు. చిత్రమేమిటంటే.. వ్యక్తులుగా వీళ్ళకి ఏదీపట్టదు, ఏదీ పట్టించుకోరు. వీళ్ళలో పట్టించుకోవడం, పట్టించుకోకపోవ డం పరస్పర విరుద్ధంగా కనబడతాయి. జీవితంలో మమేకమై ఉండడాన్ని- సంపూర్ణంగా ఉండడాన్ని చూస్తాం. ఇంకో పక్క ఊదో అంటనితనం- ముట్టీముట్టనితనం- తామరాకు మీద నీటి బొట్టులా అయినా వీళ్లు కవుల్లా చలామణి అవుతుంటారు.

కొందరి కవుల కవిత్వం పొయిట్రీ జనే లేదా సమాచార కవిత్వం. ఎందుకంటే పత్రికాకదనాల్నీ, ఆగ్ర హాల్నీ, అపరిపక్వమైన ఆలోచనల్నీ వ్యవధి లేకుండా అక్షరీ కరణ జరిగిపోవడమే దాని తార్కాణం. కవిత్వం వల్ల ఇటువంటి వాటికి జరిగినంత మేలు, ఇటువంటి వాటివల్ల కవిత్వ ప్రేమికులు ఉద్యమాతీతమైన కవిత్వాన్నే ఆశిస్తున్నారు.

కవిత్వం రాయడం తప్పేమీకాదు, కానీ, ఒక వస్తువుని పూర్వాపరాలు, మంచి చెడ్డలు, లాభనష్టాలు బేరీజు వేసుకుని, ఒక ఆలోచనాత్మకమైన నిర్ణయానికొచ్చాక, అక్షరీకరించడం మంచిది. సమాచార రహితంగా- ఆలోచనా హితంగా ఆవేశ పూరితంగా, ఏ విషయాన్ని గురించి తొందరపాటుతో నిర్ణయానికి రాకూడదు. అందునా కవిత్వీకరించే విషయంలో మరీ జాగ్రత్త మంచిది.

సమాజం సందిగ్ధ, సంక్షుభిత, దోలాయ మానస్థితిగా త్రిశంకు స్వర్గంలో ఊగిసలాడుతుండగా, కవి-కవిత్వంలో పునరాలోచించు కోవలసిన సమయం ఆసన్నమైంది. అప్పుడు కవి ఒక రకమైన డోడో పక్షిలాంటి వాడనిపిస్తుంది. ఒక జాతిచెట్టు విత్తనాల్ని మింగి దాని కడుపులో జరిగే రసాయన ప్రక్రియవల్ల విసర్జించినపుడు మొలకెత్తుతుంది. మామూలుగా మొలకెత్తదు.

కవిత్వమంటే- అనుభూతులు, ఉద్వేగాలు భావపరంపరల ఊట. అలాంటి కవిత్వాన్ని అనుకున్న తడవుగా అక్షరబద్ధం చేయగలగడం ఒక కవికి సాధ్యమయినట్లు కవయిత్రికి సాధ్యపడటం లేదన్న వాక్యంలో నిజం లేదు. స్పేస్, టైమ్‌లు కవయిత్రుల దగ్గర కొచ్చేసరికి సంకుచితమౌతున్నాయని, వ్యక్తిగతంగా వారికి ఇలాంటి పరిస్థితి లేకపోయినా, వారి ఆలోచనలను కాగితం మీద పెట్టేటప్పుడు ఏదో ఒక దశలో స్త్రీలు ప్రత్యక్ష, పరోక్ష రూపాల్లో వివక్షను ఎదుర్కొంటుండడం కఠిన వాస్తవమని కొందరు కవయిత్రులు అనడం అపుడపుడూ వినబడుతోంది.

**కవిత్వం రాయడం తప్పేమీకాదు, కానీ, ఒక వస్తువుని పూర్వాపరాలు, మంచి చెడ్డలు, లాభనష్టాలు బేరీజు వేసుకుని, ఒక ఆలోచనాత్మకమైన నిర్ణయానికొచ్చాక, అక్షరీకరించడం మంచిది. సమాచార రహితంగా- ఆలోచనా హితంగా ఆవేశ పూరితంగా, ఏ విషయాన్ని గురించి తొందరపాటుతో నిర్ణయానికి రాకూడదు.**

కవిత్వరంగం ఇప్పుడు మరింత విస్తృతమవుతుంది. అంతకుముందు లేని అవకాశాలలో దాని పరిధి విశాలమవుతుంది. స్వేచ్ఛా రూపాలతో పాటు వైవిధ్యపూరితమయిన వస్తువుల్ని నిర్వహించే వెసులుబాటు కలిగిస్తుంది.

కవి వర్ణిస్తున్నాడంటే- లేనిది కవి కల్పిస్తున్నాడని చాలా మంది అనుకుంటారు. వర్ణనంటే- విస్తరించి చెప్పడం. ఇందుకోసం కవి రకరకాల శబ్ద చిత్రాలనీ, అలంకారాలనీ ఎల్యూషన్స్‌నీ, ఒక్కోసారి వాస్తవ ఘటనల్నీ కూడా ఆశ్రయిస్తూ- అందంగా అర్థంగా అక్షరీకరిస్తుంటాడు.

కొందరు కవిత్వంలో అన్ని ప్రక్రియలలోనూ రాణిస్తారు. మరికొందరికి కొన్ని ప్రక్రియల ద్వారా విస్తృతార్థంలో పదబంధాలు, జాతీయాలు, నుడికారాలు "పదం" పరిధిలో మాత్రమే పేరొస్తుంది.

ఒక్కోసారి కవిత్వం కొమ్మల సవ్వడి చేస్తుంది. అవ్యక్త రూపం దాలుస్తుంది. ప్రాణం రెక్కలు కట్టుకొని ఆకాశంలో పరిక్రమిస్తుంది. ఇంకోసారి ఇంద్రధనస్సు బహువర్ణ వైచిత్రితో జగత్తులోని అనేకత్వాన్ని సమన్వయాన్ని సూచిస్తుంది. ఆ ధనస్సు చేసే సవ్వడి మానవ చైతన్యంలోని, ఏకత్వాన్నీ, అనేకత్వాన్నీ ఏకకాలంలో స్ఫురింపచేస్తుంది. మనసులోంచి పొంగిన ఆలోచనే శక్తివంతమైన వ్యక్తీకరణగా "లిరిక్"కి ప్రాణంగా నిలుస్తూ వస్తుంది. అలాటప్పుడు కవిలో కలిగిన ఉద్విగ్న భావాల్ని అక్షరబద్ధం అయితే అద్భుతంగా ఆవిష్కృతమవు తుంది.

అచేతనాల్లోని చేతనత్వాన్నీ, చేతనత్వం తమ సొమ్ము అనుకునే మనుషుల్లోని అచేతనత్వాన్నీ ఎదురెదురుగా నిలిపి వ్యాఖ్యానించడం కవిత్వంలో మరోగొప్ప విశేషం అని ఉత్తమ కవి ఎపుడు గుర్తు పెట్టుకొని కవిత్వ రచన చేస్తుంటాడు.

సమాజంలో అరాచక శక్తులు తెచ్చే అతిశయం కుట్రలు, కుతంత్రాలు వాటికి బలయ్యే అమాయక జీవులు, మనిషిని మనిషే నిలువునా తినేస్తున్న దౌష్ట్య, వీటిని తట్టుకోలేని బడుగు జీవుల ఆత్మహత్యలు, ఫలితంగా విచ్ఛిన్నమవుతున్న కుటుంబ వ్యవస్థ ఇత్యాదులు, కవికి ఎపుడూ కవితా వస్తువులుగా కనిపిస్తాయి. వినిపిస్తాయి. కవిత్వమెపుడూ రాయమని అనిపిస్తాయి.

కవిత్వాన్ని పరిపూర్ణంగా అందరూ అనుభవించాలి. అందుకు అవసరమైన శక్తి సామర్థ్యాలు ఉత్తమ కవి అంతరాంతరాల్లో నిబిడీకృతమై ఉంటాయి. ఆత్మ సంయమ నంతో- నిరంతర అధ్యయన శీలత్వంతో అంతర్ముఖమై ఆ శక్తి సామర్థ్యాలను ఆ కవి వెదికి దొరకబట్టుకొని వాటిని సాధనాలుగా చేసుకొని ప్రతి క్షణాన్నీ విలువైనదిగా స్వీకరిస్తూ, పాఠకులు ఆ కవిత్వాన్ని ఆనందమయంగా అనుభవించేటట్టు కవి చేయాలి.

అప్పుడు పాఠకుడు అక్షరాల వెంట పరుగెడుతూ కవిత పూర్తయ్యే దాకా ఉత్కంఠ పడుతూ, ఆ తర్వాత కూడా కొన్ని క్షణాల పాటు ఆ "ట్రాన్స్"లోంచి బయటకు రాలేకపోవడం- ఒక మంచి కవికి గాని, కవిత్వానికి గాని ఉండాల్సిన ముఖ్య లక్షణం అని అప్పుడు పాఠకోత్తముడు గ్రహిస్తాడు.

**-ఎస్.ఆర్.భల్లం**
సెల్: 9885442642

## తెలుగు భాషలోని తీయ్యదనమంతా పద్యంలోనే ఉంది

పద్యకవి రాధశ్రీ దంపతులను సత్కరిస్తున్న అతిథులు సాధన నరసింహాచార్ల, బైస దేవదాసు, వీణాదాసు, టీ. గౌరీశంకర్, పి. ఎల్లారెడ్డి, కె.సి.పి. గుప్త తదితరులు.

సాధన సాహితీ స్రవంతి, భారత్ వికాష్ పరిషత్, రసవాహిని, సాహితీ రస స్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ పద్య కవి పద్య మౌళి డా॥ రాధశ్రీ 64వ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 17న నగరంలోని భారత్ వికాస్ పరిషత్ సత్సంగ్ హాలులో పద్యకవి డా॥ రాధశ్రీ పద్యాల తోమాల కార్యక్రమం ఉదయం 9 గం॥ల నుంచి సాయంత్రం 

## మూల వనరులు

మంచి ముడిసరుకులతో
నాణ్యంగా అల్లబడిన సమాజమే
పక్కాగా నిలుస్తుంది
నలుగురికి నీడనిస్తుంది
మూఢ నమ్మకాలను తరిమి కొడుతుంది
ఆలోచనా బీజులకు సుక్షేత్రమవుతుంది..
విజ్ఞానాంకురాలకు ప్రాణ వాయువువుతుంది
పెను సవాళ్లను తిప్పికొట్టే
ధీరత్వాన్ని చుట్టుకుంటుంది
ఆత్మ విశ్వాసపు ఎజెండాను లిఖిస్తుంది
గెలుపు కేతనాల ఖాతాలకు
శ్రీకారం చుడుతుంది
దేశ చరిత్రకు స్వర్ణాక్షరాల్లో
సొబగులద్దుతుంది
భావి తరాలకు కరదీపికగా
మనగలుగుతుంది.
అక్షరాస్యతా మూలవనరులైన
దృశ్య, శ్రవణ, పఠన, లేఖనాదులు
పదుగురికీ పంచబడాలి.
కవిగణమంతా మన కర్తవ్యాన్ని పాటిద్దాం
సమాజంతో పాటింపజేసే దిశగా
మంచి పొత్తాల పఠనం చేస్తూ
అధ్యయనా దిగుబడుల ఫలాలను
జనహిత సాహిత్యంగా
అక్షరబద్ధం చేద్దాం.

-సోంపాక సీత
7702436964
8639311050

## మాట్లాడుకుందాం!

మాట్లాడుకుందాం! రండి
మనసు విప్పి మాట్లాడుకుందాం..!
కల్మశం లేని హృదయంతో
మాట్లాడుకుందాం..!
పొరపొచ్చాలు లేని సహన భాషలో
వెలుగు రేఖల మమతానుభావాలతో
ఆత్మీయ హృదయ అనురాగాలతో
మాట్లాడుకుందాం..!
కాలం నడిపించిన యాత్రలో
అనుభవ గాయాలు ఆకాశపు చీకటిలా
స్మృతి రెక్కలపై నిలబడి
హృదయాన్ని కల్లోల పరుస్తూనే వుంటాయి
గాయపడ్డ మనసులు అనుభవ మూటతో
జీవన యాత్ర చేస్తున్నప్పుడు
ఊడలమర్రి లాంటి విద్వేషాలను
నిరంతరం ప్రశ్నల పరంపరగా
ఎదుర్కొంటూనే ఉంటాయి.
మంచి మాటకు విలువ ఇవ్వకున్నా
ఆ మాట ఎప్పుడూ విలువల ఆకాశంలోనే
నిలబడుతుంది.
చెడు మాట అయినా..! అబద్ధమైనా!
అది అదృశ్య అంతఃసూత్రం
నిలకడ లేని భ్రమ సూత్రం.
అందుకేలో నిరంతరం మాట్లాడుకుందాం!
మనస్సు విప్పి మనోఫలకాన్ని తెరిచి
జ్ఞాపకాల పొరలను నెమరేసుకుంటూ
మాట్లాడుకుందాం!
కపటం వదిలి మాట్లాడుకుంటే..
విషభావాలు సమాధి చేయబడతాయి
నిప్పులా నిజం నిలబడుతుంది
హృదయం ఆనంద పుష్పమై
విచ్చుకుంటుంది
అందుకే మాట్లాడుకుందాం.! ..రండి.

-మహ్మద్ నసీరుద్దీన్
సెల్: 9440237804

## మతం-సమ్మతం

మతమంటే సమ్మతం!
ఒక్కొక్కరి అభిమతం!
హిందూ ముస్లింలు
ఈ నేలనే పుట్టినారు
ఒకరికొకరు సోదరులై
పెరిగినారు ఎదిగినారు
మతం పేరుతో మనకు
కలహాలు ఎందుకు..?
మానవత్వం మరిచి
శతృత్వం దేనికి..?
అల్లాను ప్రార్థించే ముస్లింలైనా
భగవంతుని సేవించే హిందువులైనా
మనుగడ కోసమే
ప్రతి మనిషి పోరాటం..!
శాంతి సౌఖ్యాలకోసమే
అందరికీ ఆరాటం..!
ఏ మతం వాడైనా రక్తం ఎరుపే
ఎవరి తాపత్రయమైనా భుక్తి కోసమే
భక్తి ఎపుడు కారాదు
ద్వేషానికి కారణం
దేవుడైనా, అల్లా అయినా
మెచ్చరు మన మధ్య రణం
ఒకరి ఆచారాలనొకరు
మన్నించాలి!!
ఒకరి సంప్రదాయమొకరు
గౌరవించాలి!!
హిందు-ముస్లిం ఐక్యతకై
అందరమూ శ్రమిద్దాం!!
భరతమాత శాంతి కొరకు
అందరమూ తపిద్దాం!!

- గరిశకుర్తి రాజేంద్ర
సెల్: 9493702652

## హైకూలు

మేఘాల మాటు
గుసగుసలాడుతూ
తారా శశాంక.

సంధ్యా సమయం
ఆకాశం అంచున
పండు జారింది.

అంబరమంతా
తిలకం పూసుకుంది
ఉషోదయాన.

ఆర్పి కట్టాయి
చినుకులు-హరంగా
ఇంద్ర ధనస్సు.

అంపశయ్యపై
ముద్దు లొలుకుతోంది
గులాబీ కూన.

ఎండి నాకులు
తలంబ్రాలయినాయి
వేసవి కాలం.

భూమి ఆకాశం
సమంగా పంచుకున్నాయి
సూర్య చంద్రుల్ని

తుఫాను వచ్చి
చెట్టును కూల్చేసింది
నీడ ఏమైంది..!

చీకటి విశ్వం
నిత్యమూ దీపావళే
నింగి చుక్కల్తో

అడవి నిండా
కాలిబాట జాడలే
దొంగ వ్యాపారం

ఉరుములతో
ఎరుపెక్కిన నింగి
గర్జిస్తున్నది.

విలపిస్తోంది
ముళ్ళ పొదలో చిక్కి
అందాల రోజా.

కారు మేఘాలు
తెల్లపూలు రాల్చాయి
భూదేవి పూజ



- బొబ్బిలి జోసెఫ్
సెల్: 9989261991

## మనం భారతీయులం

కులమనీ, మతమనీ కుమ్ములాట ఎందుకు?
నీదనీ, నాదనీ వాదులాట ఎందుకు?
భాష అనీ, ప్రాంతమనీ భేదభావమెందుకు?
దేశ మగ్రగామిగా నిలుపుదాం పద ముందుకు.
రాష్ట్రాలన్నీ మనవే- భాషలు అన్నీ మనవే
అందరిలో ఉన్న భారతీయ ఆత్మ ఒక్కటే
అందరిదీ ఒకేమాట- అందరిదీ ఒకే బాట
మనం భారతీయులం- మనం భారతీయులం
విలువలతో కూడిన విద్య మనకు కావాలి
వివేచనతో పనులు చేసె నేర్పు మనకు రావాలి
పరోపకారం మన సహజగుణం కావాలి
అందరి అభ్యున్నతి మన ఆదర్శం కావాలి.
ఆధ్యాత్మిక సంపదను అందిపుచ్చుకోవాలి
సాంకేతిక విజ్ఞానం సంతరించుకోవాలి
ఆర్థికంగ మన దేశం ప్రగతిని సాధించాలి
మన శ్రమ, మేధస్సులు అందుకుపకరించాలి.
స్వతంత్ర సమరయోధుల త్యాగాలు స్మరించుదాం
స్వారాజ్యాన్ని మనకృషితో సురాజ్యంగ మార్చుదాం
సమయం సద్వినియోగం చేస్తే మనదే జయం
వనరులను సక్రమంగ వినియోగిస్తే విజయం

- ఎ. గజేందర్ రెడ్డి
సెల్:9848894086

## కవితా సాగరమథనం

కవిత గాఢంగా ప్రారంభించాలన్నా
గుట్టు విప్పి ముగించాలన్నా
భావాల తీవ్రత, అక్షరాల ఆర్ద్రత
సమతూకం చేయాలి!
కష్టాల కన్నీటి ఉప్పదనంలో
దుఃఖ సముద్ర లవణ శాతమెంతో
లెక్కించాలి!
నిట్టూర్పుల గుండెమంటల సెగలో
బాధాగ్నిశిఖ వేడి ఎంతో గణించాలి!
ఆనందాల క్రీడాకేళిలో
గెలుపు మలుపు గుట్టేమిటో
పోల్చుకోవాలి!
సంతోషాల వెన్నెల చినుకుల్లో
చిటపటల శబ్దకేళి ఎంతసేపో
గుర్తించాలి!
భావోద్వేగాల ఆవేదనల మూటలో
సమతౌల్యాల మాటలను
తూకమెయ్యాలి!
అనుభవాల క్రమ పరంపరలో
నేర్చుకున్న పాఠాల నిగ్గు తేల్చాలి!
ఎగిసిపడే అలల ఉద్భృతిలో
దాగివుండే బిందువుల రొద
ఏమిటో చెప్పాలి!
జారిపడే నష్టాల జలపాతంలో
కోసుకుపోతున్న శిలల దేహమెంతో
పరిగణించాలి!
త్రుళ్ళిపడే ఈర్ష్యాద్వేషాల కార్చిచ్చులో
దహించుకుపోతున్న పచ్చదనమెంతో
స్పష్టం చేయాలి!
శ్రమ శరీర చెమట చుక్క తడిలో
కరిగే హృదయపు వడి ఎంతో
కొలవాలి!
ప్రతి విషయాన్నీ
సున్నితంగా స్పృశించాలి
నిశితంగా పరిశీలించాలి
సాలోచనగా వీక్షించాలి
ఆర్ద్రతగా శ్రవణించాలి
అప్పుడే కదా
లోతుల లోగుట్టు తెలిసేది
భావ సాగర మథనంలో
కవితామృతం పుట్టేది!

- పి.లక్ష్మణరావు
సెల్: 9441215989

## ప్రకృతి పాఠం!

చెట్లు
స్వీయ ఫలాన్నైనా
నెత్తికెత్తుకోదు!

మొక్క
పూలన్నీ తన సొంతమే అయినా
పరిమళాలను దాచుకోదు!

పొద్దు
వెలుతురంతా సొత్తేనని
పంచకుండా ఉండిపోదు!

నది
నడకెంత దూరం సాగినా
పొలాల దాహం తీర్చందే శాంతించదు!

మేఘం
అందనంత దూరంలో ఉన్నా
నేలకు జలదానం చేయనిదే చల్లబడదు!

ప్రకృతి
అనాదిగా నేర్పుతున్నది పరోపకారమే
నీతి తప్పిన మనిషే ప్రళయకారుడవుతున్నాడు!!

- కోట్ల వెంటేశ్వరరెడ్డి
సెల్: 9440233261

## అక్షర మంజీరాలు

నిలువెత్తు ఆకుపచ్చని నీడను
గుండెనిండా దాచుకుని
మట్టి పొత్తిళ్ళల్లోంచి
తలెత్తే విత్తనామా
నీకు వందనం.
ఎన్ని వేల క్షణాలు
తపస్సు చేసిందొ కాగితం
అక్షరాల చెలిమి
కరచాలనం కోసం.
జ్ఞాపకాలూ పరిమళాల్లానే
అనుభూతిని గుండెసూదికి గుచ్చి
దారాలు దారాలుగా గాయాలు
రాలిన పూరేకులపై
ఎడదను పరిచాను
ఎన్ని వేల వెన్నెల సంతకాల
అడుగులో..
వర్షానికి వైషమ్యాల్లేవు
కాలువల్ని చెరువుల్ని, నదుల్ని
చేరచీలుచుకుని
కడలి ఒడిలోకి చేరుతుంది
తనువెల్లా తడుస్తూనే.
పక్షులు లేని ఆకాశంలో
మేఘాలు వరుసగా
దిగులు దారాల్ని
పేనుతున్నట్లు
ధారలు ధారలుగా
రాలిన ఆకుల శ్వాస
విడరాని స్మృతిలా
కొమ్మల మొదళ్ళను
మునివేళ్ళతో కలవరపెడుతూ
కాలం వేగపు పరుగులో
కనుమరుగైన కాగితం పడవలు
కారే కన్నీటిని
జారే ప్రవాహపు అడుగున
దాచుకుంటూ..
దీపానికెంత కరుణ
కాసింత దాహం తీరిస్తే
కొండంత వెలుగును
ఆహారంగా అందిస్తుంది
వేల కిరణాల చేతుల్తో.
అడవి గుండెను తొలుచుకుంటూ
సాగే మనిషి కళ్ళలో
కన్నీళ్ళున్నాయా.. ఏమో..
పచ్చదనం చెదిరి చెల్లాచెదురై
దిగులు ఆకాశంలోకి విస్తరిస్తోంది
చెమ్మదనం చెరువు ఒడిలో
విలపిస్తోంది
ఎడారిలో మనిషి
వసంతం కోసం వెతుకుతున్నాడు.
చీకటి నిశ్శబ్దపు అడుగుల సడిని
దాచుకుంటోంది పదిలంగా
ఒంటరితనానికి భయపడి.
శూన్యం అంచులనిండా
పరిమళం ధూపంలా
ఏ విరి మౌనంగా
వికసించిందొ మరి.
చిత్రంగా కళ్ళల్లో తడిలేదు
అనంత సముద్రాల్ని మోస్తూ
అంతరంగం
సాగరమే గుండెలో
వాన వెలిసింది
నీటి గుంటల్లో
మోము చూసుకుంటూ
మేఘాలు.
రాలిన జ్ఞాపకాల నీడలలో
ఒంటరిగా చెట్టు.
చెట్టుపై ఒంటరిగా పిట్ట
అన్నింటికీ అతీతంగా
శిశిరాన్ని ధ్యానిస్తూ.
అడవి దారంతా
పచ్చిపూల పరిమళం
దారాలు దారాలుగా
అనంతమైన నిశ్శబ్దాన్ని మోస్తూ
వెలుగుకు కాపలా కాస్తూ
చీకటి.

- మొదలి పద్మ
సెల్: 92482 59622

## రెక్కలు

కుంచె పట్టని
చిత్రకారిణి
కొమ్మల్లో
ఊసరవెల్లి-
ఉదరపోషణార్థం
బహూకృతవేశం.

పేరంటాళ్ళు
రాకున్నా
నోమునోచింది
ఇల్లాలు-
సెల్లు ఒళ్ళంతా
బొట్టు బిళ్ళలు.

బడిలోగంట
గంటగంటకీ
ఉలిక్కి
పడుతోంది
ఆదివారం
సెలవు పుణ్యం.

మందారానికి
తనపైనే కోపం
పేరు సుందరం
అని లేనందుకు-
క్రోధాగ్ని
అరుణవర్ణం.

శిల్పం
గొప్పతనం
ఉలిదా?
శిల్పిదా-
శిల
త్యాగానిది,

'అ'భయాంజనేయం'కి
'ఉభయాంజనేయం
అని రాశాడు
గుళో పెయింటరు
భక్తుల
నిత్యనైవేద్యాలు

చిలకప్రాణం
చెట్టు తొర్రలో
వెన్నెల ప్రాణం
సూర్యుని 'బుర్ర'లో
భద్రతలో
అస్తిత్వం.

పెళ్ళికి
ఉంగరం
చక్కని
'ఆభరణం'-
విడుకులతో
'ఆ' నిషిద్ధాక్షరి.

- ఉమ్మడిశెట్టి రాఘవరావు
సెల్: 9247108893

## మరీచిక

నీవున్నా, లేకున్నా
సడియేదో నినదించును
దరికి చేరరాకున్నా
ధ్వని యేదో వినిపించును.
ఉన్నా, కనరాకున్నా
మసకద పదో తోచును
లేకున్నా ఊహల్లో
మాయ మరీచికదోచును
కలలో కనపడినప్పుడు
నీవున్నావనుకున్నా
ఇలలో కనబడని నీవు
లేనే లేవనుకున్నా
మానవ రూపంలో నువు
మంచిని బోధిస్తుంటె
దుర్మార్గులకైనా తుదకు
మోక్షము నిస్తానంటె
వినికూడా వినవట్టే
వింతగ వీక్షిస్తున్నా
నిజానిజాలెరుగలేక
నిశ్చలంగ నిలుస్తున్నా

- రస ప్రవంతి -9290215858
కావ్యసుధ - 9247313488

# ఎక్కడికీ పయనం

పుస్తక సమీక్ష

సారస్వత కళానిధి డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మిగారి కలం నుండి జాలువారిన "ఎక్కడికీ పయనం" కవితా సంపుటి మానవతా విలువలకు అద్దం పడుతుంది. సంస్కృతాంధ్ర భాషలలో నిష్ణాతులైన వీరు గుంటూరు, ప్రకాశం జిల్లాలలో అనేక పదువులను నిర్వహిస్తూ, సాహిత్య రూపకాలకు రూపకల్పన చేసి వారి పర్యవేక్షణలలో వివిధ వేదికల మీద ప్రదర్శించటం జరిగినది. ఎన్నో పురస్కారాలను, ఎందరో ప్రముఖుల ప్రశంసలనూ పొందిన బహుముఖ ప్రజ్ఞాశాలి, "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక మరియు సాంస్కృతిక సమితి" వారి సహకారంతో ఈ కవితా సంపుటిని మన ముందుకు తీసుకువచ్చారు. ఈ సంపుటిలో యాభైకి పైగా కవితలున్నాయి. వైవిధ్య భరితమైన అనేక అంశాలను తీసుకొని రచించిన కవితలు ఇందులో మనకు దర్శనమిస్తాయి.

ఇందులో మొదటిదైన "పుస్తకం" అనే కవితలో లోకాన్ని చూపించేది పుస్తకమన్నారు. "అంతర్యుద్ధం" అన్నదాంట్లో మనిషిని నిలువెల్లా దహించేది అంతర్యుద్ధమన్నారు. "తరువందనం" అన్న కవితలో పంచభూతాత్మకమైన దేహం పంచభూతాలకే అంకితం. ప్రణమిల్లటంతప్ప ఏమివ్వగలమని ఆర్తితో అన్నారు. "పల్లెఒడి" "అమ్మ ఒడి" ఒక్కలాంటివే అన్నారు. వంటచేసే ప్రాణంగా భావించే తండ్రి ఆవంటచేలోనే కన్నుమూసినపుడు ఆమెలోని ఆవేదననంతా "నాన్నపై కందువా" అనే కవితలో చూపించారు. ఆ కవిత చదువుతుంటే చమరించని కన్నుండదేమో? విజ్ఞానం, వినోదం, వివేకం, విలాసం, వికాసానికి అందించేదిగా "దూరదర్శిని'ని అభివర్ణించారు. నిరంతరాయంగా తిరిగే 'లిఫ్టు' గురించి చెబుతూ మనిషి ఉత్థాన పతనాలకు దర్శణమన్నారు. "ఆగమనం" అన్న కవితలో తల్లిగర్భంలో వున్నన్నాళ్లు శు




క్లపక్షచంద్రునిలా పెరిగే ఆయుష్షు భూమి మీదకు రాగానే కృష్ణపక్షంలా తరుగుతుందన్న సత్యాన్ని వెల్లడించారు.

పంటకు పట్టిన తెగులును మమతాను బంధాలకు పట్టిన చెదలంటూ "మకరం సంక్రమణం'లో చెప్పటం మమతాను రాగాలకు ఆమె ఇచ్చే విలువ తెలుస్తుంది. అమెరికాలో డాలర్లు పండుతాయి. ఇండియాలో సంతానం పండును అని "స్వర్ణభారతం"లో ఆమె చెప్పిన మాట పిల్లలకు మించిన సంపద వేరే లేదని వారి ఉద్దేశ్యము.

నిస్వార్థంతో కులమతాల కతీతంగా ప్రాణాలను పణంగా పెట్టి పోరాడే సైనికుని గొప్పతనాన్ని "సైనిక సోదరా"లో చూపించిన కవయిత్రి ప్రతిభ అద్వితీయము. "అమ్మ" అనే రెండక్షరాలు అమృతము చినుకులుగా అభివర్ణించటంలో తల్లి పట్ల వున్న ప్రేమద్యోతకము.

ఇలా ఒకటి కాదు, రెండు గాదు ఈ సంపుటిలో మొత్తం యాభై కవితలూ ఒక్కొక్కటి ఒక్కొక్క ఆణిముత్యము. సరళమైన శైలిలో, పాఠకుని మనస్సుకు హత్తుకొనేట్లుగా వ్రాయటం ఆమె ప్రతిబకు తార్కాణం. మానవ జీవన చిత్రణను, మానవతా విలువలను మనకన్నుల ఎదుట నిలిపిన ఈ కవితా సంపుటిని చదువుతుంటే మనం ఎక్కడికో పయనమైనట్లు కల్గుతుంది. తల్లిదండ్రులు జన్మనిస్తే గురువు అక్షర భిక్ష నొసగితే, ఆ అక్షరాలు పునర్జన్మ నిచ్చాయన్నారు కవయిత్రి. నాగరాజ్యలక్ష్మి గారి హృదయస్పందనకు దర్పణమైన "ఎక్కడికీ పయనం" అను ఈ వచన కవితా సంపుటిలోని ప్రతి కవితా చదువరులను ఆలోచింపచేసేవిగా వుంటుంది అని చెప్పవచ్చును.



ప్రతులకు: డా॥వెలువోలు నాగరాజ్యలక్ష్మి
301, రామన్న టవర్సు, 1వ లైను రామన్నపేట
గుంటూరు- 522 007.
సెల్: 9394113848.
వెల: 100/-, పేజీలు: 100

-డా.మైలవరపు లలితకుమారి
9959510422

## శ్రీపదాలు

ఏ గోపికవమ్మా నీవు
పోల్చుకోలేకున్నాను తల్లీ నేను
రాధవా ఇందులేఖవా తుంగవిద్యవా
నల్లనయ్యను మనసున తలవగనే
గోపికమ్మ గండె జల్లుమన్నది
చేతిలోని కుండ జారుతున్నది.
గోపికమ్మల కులుకును చూస్తే
తలపులన్నీ తమకమాయె చూడు
అమలిన శృంగారమే ఆధారమై?.

-నగునూరి రాజన్న
8332963129

## ఏదెక్కడ ?

ఇదో తర్కం
తొమ్మిది ఇంటు తొమ్మిది
గళ్ళ చదరం
ఒకటి నుండి తొమ్మిది అంకెలు
అడ్డం తొమ్మిది
నిలువు తొమ్మిది
మొత్తం ఎనభైఒకటి గళ్ళు
మూడు ఇంటు మూడుగా
ఉపచదరాలు తొమ్మిది
ఇవ్వబడ్డ అంకెలతో
ఇది ప్రహేళికాపూరణం
మొత్తం పూరిస్తే సుడోకు,
సుడోకు జపాన్ భాషార్థం
డిజిట్స్ మస్ట్ బీ సింగిల్
ఒక అంకె అడ్డం,నిలువు,
ఉపచదరంలో ఒకసారైతేనేసరి
అంకెలు ఏదెక్కడో !
నింపుటకు తార్కిక ఆలోచనే గురి
వన్ బై వన్ అంకె
కుదిరిందంటే అదిరింది
తొందరగా సెట్ అయితే సంతోషం
లేదంటే మైండ్ బ్లాస్టింగ్
అంకెల మార్పుతో సెట్టింగ్
ఈ ఆటతో పెరుగుతుంది
మెదడు చురుకుదనం,
ఏకాగ్రత, పట్టుదల ,సాధించాలనే
తపన , సుడోకుప్రియులకు
ఇది ఉత్సాహపు ఉరుకు నిచ్చే
అంకెల అమరిక అద్భుతం
(గాడ్ ఫాదర్ ఆఫ్ సుడోకు "మాకీ కాజీ" స్మృతికి, 17-8-2021న లోకాన్ని విడిచారు )

-సంధ్య సుత్రావె,
9177615967,

## జీవన నావకు చుక్కాని

మేధో మహావృక్షం గురువు
విజ్ఞాన నీడను పంచే
విశ్వాసం నింపే చెలిమె
తడబడినపుడు ఊతకర్ర !
కనిపించే దైవరూపం
నీడలా రక్షించే శక్తిరూపం
విజ్ఞాన వనరుల కేంద్రం
ఎదుగుదలలో ఉత్ప్రేరకం !
శాస్త్రసాంకేతిక నైపుణ్య నిధి
వ్యక్తిత్వ వికాస పునాది
శ్రేయస్సును కోరే పెన్నిధి
విజ్ఞాన వివేకాల సన్నిధి !
నవ యువ తరాల నిర్మాత
సామాజిక చైతన్య గీతిక
విజ్ఞాన వితరణకే వెన్నెముక
జ్ఞాన విత్తులు నాటే కర్షకుడు !
శిలను శిల్పంగా చెక్కే శిల్పి
మదిని సుసంపన్నం చేసే నిధి
పువ్వుకు పరిమళమద్దే చేయి
జీవనోపాధి చూపే జ్ఞాని గురువే !
ఉన్నతిని కోరే ఊటబాయి
నీడలా రక్షించే గొడుగు
విజ్ఞానమే సంపదైన వివేకి
నిస్వార్థ లోక హితవరి !
జన దేవాలయ పూజారే కాదు..
జీవన సౌందర్య ప్రాణవాయువు
గురు ఉపదేశాలే దిశ నిర్దేశాలు
గురువు కదా జీవన నావకు చుక్కాని !

-బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## మణిపూసలు

రాజకీయమే మంచిది
రాజకీయమే చెడ్డది
ఏ దేశములో జూసిన
రాజకీయమే పెద్దది!
రాజకీయమే రంకుది
రాజకీయమే బొంకుది
భూతల చదరంగంలో
రాజకీయమే మంకుది!
రాజకీయమే వాడి
రాజకీయమే వేడి
అభివృద్ధను ఆటలోన
రాజకీయమే నాడి!
రాజకీయమే దాడి
రాజకీయమే పాడి
ప్రతిదానికి లోకంలో
రాజకీయమే జోడి!
రాజకీయమే రణము
రాజకీయమే ధనము
పై ఎత్తులు వేయుటలో
రాజకీయమే ఘనము!
రాజకీయమే గళము
రాజకీయమే దళము
దేన్నైనా సాధించగ
రాజకీయమే బలము!
రాజకీయమే తంత్రం
రాజకీయమే యంత్రం
సమస్యల సాధనకు
రాజకీయమే మంత్రం!
రాజకీయమే శత్రువు
రాజకీయమే మృత్యువు
ద్వైపాక్షిక చర్చలకు
రాజకీయమే సేతువు!
రాజకీయమే అందం
రాజకీయమే బంధం
ఆశలను పెంచుటలో
రాజకీయమే గంధం!
రాజకీయమే విందు
రాజకీయమే చిందు
మంచిచెడ్డ లన్నిటికి
రాజకీయమే మందు!
రాజకీయమే ఓట్లు
రాజకీయమే పాట్లు
నెరవేరని హామీలకు
రాజకీయమే తూట్లు!
రాజకీయమే కత్తి
రాజకీయమే వెత్తి
హెచ్చు తగ్గులందున
రాజకీయమే చల్తి!
రాజకీయమే కూడు
రాజకీయమే గూడు
సకల జనాలందరికి
రాజకీయమే తోడు!
రాజకీయమే వర్గము
రాజకీయమే దుర్గము
మార్గము లేని దానికి
రాజకీయమే మార్గము
రాజకీయమే గండి
రాజకీయమే దండి
అన్నిట్లో కలసివున్న
రాజకీయమే తొండి!
రాజకీయమే కొండ
రాజకీయమే దండ
చిల్లర కొడుకులకంత
రాజకీయమే అండ!
రాజకీయమే లంచం
రాజకీయమే కంచం
అసమర్థ నాయకులకు
రాజకీయమే మంచం!
రాజకీయమే యింపు
రాజకీయమే కంపు
నీతిని యవినీతిని
రాజకీయమే చంపు!

-వడిచర్ల సత్యం
7989511543

## తలలెత్తుకుని...!"

కాలం కాన్వాస్ పై
ఎరుపెక్కుతున్న ప్రతి పొద్దూ...
మా శిథిల జీవిత కన్నీటి చిత్రాలకు
నిత్యం రంగులు అద్దుతూనే వుంది!
ఆశలను, ఆశయాలను,
స్వీయ నిర్జయ శక్తులను
కూకటి వేళ్లతో సహా పెకలించి
కాలరాస్తూ
గారడీ బొమ్మలను చేసి ఆడిస్తోన్న
పురుషాహంకార నవ్య పురాణాలెన్నో! .
అదుపాజ్ఞల కొరడా ఝుళిపింపులు
ఆంక్షల లక్ష్మణ రేఖల 'హద్దు' గీతలు
గడియ గడియకు
గడ్డి పరకలా తృణీకరించే
చీదరింపుల భీత్కారాలు ఎన్నో! .
తన్మయత్వ స్వప్నాలు సాకారాలై
పేగుబంధం పూతకొచ్చే తరుణంలో
'ఆ... పిల్ల! ' రూపాన్ని గొంతు నులిమే
కపటి ప్రేమ భ్రూణ హత్యా పర్వంలో
మా చావుకు
మరణ వాంగ్మూలం లిఖిస్తారు!.
మేము జీవితపథం నుండి నిష్క్రమించగానే
మరో నవ వధువు పొందుకై
తాళితో తహతహలాడే
నయా నయవంచన పథకానికి
రంగం సిద్ధం చేసుకున్న 'భర్త శ్రీ'లు
చెదరి పురుగుల్లా లుకలుకలాడుతూ
సమాజ చిత్ర పటానికి
తూట్లు పొడుస్తున్నారు! .
అనుక్షణం ముళ్ల బాటలపై నడిపిస్తూ
నిత్యం మానసిక నరకాగ్నిలో పడదోస్తూ
దిక్కులు పిక్కటిల్లే ఆవేదనా సాక్ష్యంగా
బాధలను దిగమింగి రాటుదేలి
రగులుతున్న మా గుండెలు
రణ స్ఫూర్తిని ప్రోది చేసుకుని కదం
తొక్కుతూ
ధీర కాగాడల ఆయుధాలు చేపట్టి
మౌన విప్లవానికి
మార్గం సుగమం చేస్తున్నాయి! .
అస్థిత పోరాట గమనంలో
అణచివేతల వెతల సంకెళ్లను ఛేదిస్తూ
నిస్సహాయతతో తలదించిన
మా శిరస్సులు
నిర్భయ స్వేచ్ఛా జాతర వేడుకకు
ధైర్య ప్రభలై వెల్గొందుతూ
తరలి వచ్చే సమయం ఆసన్నమైంది!

-వంగర.
పరమేశ్వరరావు
9491400534

## బంధాలు

కడుపు పేగు కోతతో ఆయుష్షును అడ్డుపెట్టి ఆయువు పోసి ప్రేమ పంచి అనురాగంతో పెంచే విడదీయరానిది అమ్మతో అనుబంధం.

కనిపెంచి పోషించి ఆప్యాయత, అనుబంధం పంచే విడదీయలేని నాన్నతో అనురాగ బంధం.

ప్రేమ, ఆప్యాయత కలబోసి అనురాగం పంచే అన్నదమ్ముల, అక్క చెల్లెల్ల మమతానురాగాల అపూర్వ బంధం.

కష్టంలో సుఖంలో తోడుగా ఉండేది, జీవితపు దిశ-నిర్దేశం చూపేది గొప్పనైన స్నేహ బంధం.

ఆరాధన, ఆప్యాయత, కలబోసి ఒకరంటే ఒకరికి నమ్మకం కలిగించి అనురాగంపంచే ప్రేమబంధం

ఒకరికోసమొకరుగా,తోడు నీడ జతగా తీయని రాగబంధం, ప్రేమను పంచే ఆత్మీయత పెంపొందించే భార్యభర్తలఅనుబంధం.

సృష్టిలో ఎన్నో బంధాలు
అనురాగ ఆత్మీయ బంధాలు
ఈ బంధాలతోనే జీవితాలు కొనసాగింపు...!
జీవన గమనంలో ఈ బంధాలే కొలమానాలు..!!

-ఎన్.. రాజేష్
9849335757

## రేపెందుకు?

ఈ రాత్రికి ఇలా
చీకటి వేలి కొసలను నిమురుతూ
ఓడిపోయిన వసంతాల వెచ్చని శ్వాసలను
పెనవేసుకుంటూ
భ్రమలను విభ్రమలనూ
కాస్త పక్కకు జరిపి
ఉదయం వరకూ ముక్కలు ముక్కలుగా
రాలిపడుతున్న వెలుగు నీడలకు
అద్దం పడుతూ
మనిద్దరిమధ్యా మౌనం రాయభారం
పగలంతా స్వప్నం కాని ఊహల మధ్య
నీరెండలో కురులారబెట్టుకునే
ఒక నీడ నిన్నటిని కాదని చుక్కలను
ముక్కలుముక్కలుగా ఏరి
రేపటి మేలిముసుగు మీద అతికించు కుంటూ
మాటలు పెగలని మౌనం పెదవుల చివర
చూపుల నెమలీకలు సవరిస్తున్న
ఊహల మెత్తదనం
చూపుల వెనకన సుదూరాన నువ్వేం వెతుక్కున్నావో
నేనేం అందుకున్నానో
ఎవరికీ మాత్రం ఏం తెలుసు
లోలోపల పొగలు చిమ్ముతున్న
విస్ఫోటించబోయే అగ్ని పర్వాతాలను
అరచేతుల్లో పెట్టుకు అదే అమృతం అనుకున్నామని
ఏ మాత్రం తెలుసు
అరిగిపోతున్న అరికాళ్ళను అరచేతి నెత్తవులతో
నిమిరి గుండె అగాధాల
జలపాతాలలో ఇంద్రధనుసులా
మార్చిందని ఎవరికీ తెలుసు?
రేపు ఏనాడో కాలం గడ్డకట్టి కత్తిలా మారినా సరే
రెప్పవాల్చటం మరచిపోయిన రాత్రి వెన్నెల పెదవులమీద
ఇంకా తడి ఆరని సంతకం కదా మన అనుబంధం
కనిపించని మధుపాత్రలను సేవించి
సేవించి మత్తెక్కిన మనసులకు
ఇహ రేపెందుకు.

-స్వాతీ శ్రీపాద
8297248988

## అహంకారం

అహంకారం వీడి..
ఆప్యాయతలు పంచు..
ఈర్ష్య గుణం వదిలి..
ప్రేమను అందించు..
నిలబెట్టును సమాజాన..!
నీ పేరును శిఖరాన..!!
అహంకారం ఉంటే..
అనారోగ్యం పాలగును..
అహంకారం వీడితే..
ఆరోగ్యం బాగుండును..
అహంకారం వీడుము..!
ఆనందంగా గడుపుము..!!
అహంకారంతో చూస్తె..
అందరూ శత్రువులే..
అహంకారమిడి చూడు..
అందరూ మిత్రులే..
వారెవ్వా సోదరా..!
అహంకారం వీడుమా..!!
ధనము ఉన్నదనియు..
అహంకారం చూపకుము.
దయను కల్గియుండి..
దానధర్మాలు చేయుము..
ఇలయందున మీ ఖ్యాతి..!
ఇంతింతై పెరుగుతుండు..!!
అహంకారం ఉన్నోడు..
మమకారం చూపలేడు..
అగ్ని గోళంల మండుతు..
అభండాలు వేస్తుండు..
అబ్బో అహంకారి..!
అవుతాడు ఏకాకి..!!
అహంకారమున్నను..
వదిలిపెట్టి చూడుము..
చుట్టున్న వాళ్లందరును..
చేస్తుండు స్నేహము..
మమకారం పంచుము..!
మైత్రిని కొనసాగించుము..!!

-పసుల.శంకర్
9542181301

## విధి ఆడే వింతనాటకం

వండిన వంట...
ఆశతో వండినవారి ఆకలి తీరవచ్చు
కష్టపడనివారి కడుపులు నిండవచ్చు
ధనం వెచ్చించిన వారికి దక్కకపోవచ్చు
ప్రక్కనున్న కుక్కలు పీకలదాకా మెక్కవచ్చు.

పండిన పంట...
రేయింబవళ్ళు రెక్కలు ముక్కలుచేసి
రక్తం ధారపోసిన రైతన్నలు పొందవచ్చు
విత్తనం వెయ్యని వారికి చెందవచ్చు
దళారులకు దగాకోరులకు అందవచ్చు.

కలిపిన జంట...
సహనంతో సఖ్యతతో సర్దుబాటుగుణంతో
పదికాలాలపాటు పచ్చనికాపురం చేయవచ్చు
విడిపోనిబంధంగా వుండవచ్చు విడిపోవచ్చు
విధివిషం చిమ్మితే అదిమూడునాళ్ళముచ్చట కావచ్చు.

రగిలితే ఆకలి మంట...
ప్రశ్నించవచ్చు
ప్రతిఘటించవచ్చు
పిడికిళ్ళు బిగించవచ్చు
భీకర పోరాటం చేయవచ్చు
దారుణ మారణహోమం జరగవచ్చు
అమాయకుల రక్తం ఏరులై పారవచ్చు
రామరాజ్యం రావణకాష్ఠమై రగలవచ్చు.

ఏదేమైనా అంతా కనిపించని ఆ కాలనిర్ణయం కావొచ్చు
అంతుపట్టని ఆవిధి ఆడుతున్న
ఓ వింతనాటకం కావచ్చు

– పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

## స్వయంకృషి బాల్యం

అతడు వేకువజాము
మేలుకొలుపుల గీతాన్ని అందుకుంటాడు
సైకిల్ గుర్రాలపై వార్త ప్రపంచాన్ని ఇంటింటికి చేరవేస్తాడు
ఈ ప్రభాతం వేల లోకానికి వెలుగు సమాచారాన్ని
అందించే కార్యంలో లీనమైపోతాడు
సూర్యుడు పొడవక ముందే కాలకృత్యాలు తీర్చుకొని
పత్రికల యజమాని ముందు హాజర్ అవుతాడుతిరిగి
పేపర్ పంచిన తర్వాత
ఆ పేపర్ బాయ్ విద్యార్థిగా మారి
పాఠశాలలో జ్ఞానార్జనకు బయలుదేరుతాడు
అతడు లోకం వెలుగు పంచిన సమాచార ప్రపంచంతో
లోక వ్యవస్థ గురించి చదువుకుంటారు
ఇతను మాత్రం తన చదువుల ప్రపంచంలో
మునిగితేలుతూ ఉంటాడు
బాల్యం అతనికి స్వయంకృషితో ఎదిగే
ఒదిగి పోయే లక్షణంతోవిశాల విశ్వం పై
జ్ఞాన మూర్తి ప్రకాశించి జ్ఞాన వెలుగులు పంచాలికష్టజీవికి
ఇరువైపులా ఉన్న వాడే మనిషి అనే భావ
ప్రపంచాన్ని చిన్నప్పుడు నుంచే నేర్చుకుంటున్నాడు

–డాక్టర్ సిహెచ్ ఆంజనేయులు
7702537453

## మట్టి మనిషి బ్రతుకు..!

మట్టిపరిమళంబు:మనసారగ్రోలెడు
మహినహునుడుజూడ:మనదురైతు
సాలుసాలులోన:సాగించునాగలి
గీతదప్పనట్టి:గింజపోత!.

వానజల్లుకురియ:వర్షిల్లుభూమాత
హాలికులకుమదికి:హోయిగూర్చు
మణిమయంబుకన్న:మడులె మాణిక్యాలు
కన్నులారగాంచు:కలలపంట!

వర్షమొచ్చువేళ:వరముగభావించి
తానుహర్షమొందు:తనివిదీర
హాలికుండుభువిన:ఆత్మీయబంధువు
వానిఋణముదీర్చ:వశముగాదు!

పంటలన్నితాను:పండించిననుగాని
పరులమేలుగోరు:పావనుండు
రైతులేకయున్న:రాదురాకబళంబు
ప్రజలజీవనాడి:పరమహితుడు!

రైతుకాలుమోప:రంజిల్లుమట్టియు
పసుపుగంధమౌలె:కాళ్ళుగడుగి
కోరుపంటలిచ్చి:కోర్కెలన్నియుదీర్చి
గొంతుగోయునపుడు:కోరుజయము!

భూమిలేనియెడల:భుక్తిలేదుమనకు
రైతుదున్నకున్న:రాజనాలు
పంటలన్నిపుడమి:పండకున్ననుగాని

కుదువడానికింత:కూడుయేది?
వానకాలమందు:పనరుగా వర్షాలు
కురిసినపుడెప్రజకు:కూడుగల్గి
సస్యలక్ష్మితోడ:సంపదల్ విలసిల్లి
సంతసంబులమర:సంబరంబె!

–డా॥గన్నోజు శ్రీనివాసాచారి
8555899493

## మనిషి నీ ఉనికెక్కడ

నీరు–నిప్పు, గాలి–నేల
పంచభూతాలెప్పుడైనా
నా కోసమే నేనుకుంటే
మనిషి నేడు నీ ఉనికెక్కడ !.
నీ కోసం, నా కోసం
భరతావని విముక్తి కోసం
ఉరి తాళ్లను వాడు
ముద్దాడకుంటే
మనిషి నేడు నీ ఉనికెక్కడ !
మదమెక్కిన మృగాలు కొన్ని
అచ్చోసిన అంబోతులైతే
జనంతో నాకెందుకు
నేనైతే పదిలమంటే
మనిషి రేపు నీ ఉనికెక్కడ !

కడుపు నింపే రైతన్న
నడి రోడ్డుపై కవాతు చేస్తే
నేనెందుకు, నాకెందుకంటే
మనిషి రేపు నీ ఉనికెక్కడ !
చిన్న–చిన్న చలి చీమలు
సహజీవనపు బాట పడితే
నాకోసమే అన్నంటు
స్వప్రయోజనమాశిస్తే
మనిషి రేపు నీ ఉనికెక్కడ !

–డా॥పాక వెంకటేశ్వర్లు
9849436891

# నందివర్ధనాలు

–డి. రాములు
94403 76688

పద్యరచనలందు పాటవమ్మును జూపి
వచనరచనలందు వాసికెక్కి
కలము పట్టిమేటి కవితలల్లినయట్టి
ఎల్లవారినెపుడు ఎదను తలుతు

అమ్మనాన్న అక్క అన్నలు వదినలు
గురువు మేనమామ గురుతునుండు
కీర్తిశేషులైన మూర్తిమంతులకును
వందనములు చేతు ప్రతిదినంబు

రాత్రి పవలు గనక రక్తమాంసములను
చెమటగాను మలిచి సేద్యమందు
తాలిబొట్టు కూడ తాకట్టులోపెట్టు
పంట రైతుకు తగు ప్రణతులివియె

వినయ సంపదున్న విద్యబుద్ధులుయబ్బు
కూర్మిపొందవచ్చు నోర్మియున్న
జ్ఞానసంపదెపుడు కలిమికైవల్యమే
రత్నరాశి మూట రాము మాట

తెనుగునాటనున్న తెలుగు పత్రికలెన్నొ
అంతరించుచుండె అవని నుండి
భాష నిలువకున్న భవితేది జాతికి
తెలిసి మసలుకొమ్ము తెలుగువాడ

ఆశ్రయమ్ము లేక ఆదరమ్ముగనక
కనుమరుగవుతుండె కనులముందె
కవితకేది దారి కవులకెవరు దిక్కు
ఆర్యులార భాష నాదుకొనుడు

పూర్వచరితవున్న పుణ్యగాథల భాష
జ్ఞానసుధలు పంచు కావ్యభాష,
అన్ని వుండి కూడ అందున శనివుండి
రాజకీయ సెగలొ రగులుచుండె

భాషలన్నికన్న భావసంపదయున్న
తెలుగువాడికుండు తేజమున్న
భాషకిట్టి బతుకు భావ్యమా తెలుగోడ
తెగువజూపి బాపు తెలుగుగోడు

విద్యవున్నవాడు విజ్ఞు డౌయిలనందు
పనిలొ నేర్పువున్న ప్రాజ్ఞుడేను
చదువు ప్రజ్ఞయున్న సర్వజ్ఞుడేయగు
జ్ఞానుడౌవినయము కల్గివున్న

కడుపుమాడ్చుకుంటు కష్టపడుతుతాను
పట్నవాసమునినుపంపెటమ్మ
పల్లెటూరిబైతు పనికిరానిదియంటు
చీదరించుకొనుట సిగ్గుగాదె

తల్లడిల్లు తల్లి తన బిడ్డకేమైన
పరిత పించుచుండు పగలు రాత్రి
అమ్మ మనసునుండు అపురూపబంధమ్ము
సృష్టిధర్మమెంత ప్రేమమయము

పాకి వారు అన్న పరమ పవిత్రులు
సేవలందు వారి చేరు వెవరు
అమ్మవంటి వారు ఆరోగ్యదాతలు
ధన్యచరితులయ్య ధరణిగాంచ

కోవిదు సమయాన కొల్లకొల్లలుగాను
పాకి పనులు చేసి సాకె ప్రజను
మనదు బాల్యమందు మన అమ్మపాకీయె
పరమగౌరవంబు పాకియనిన

విశ్వసించతగ్గ విశ్వాసజంతువు
జాగిలమ్ము గాదె జగతినందు
ఆపద ఎదురైతె ఆదుకొనునుగాని
ప్రాణభయము చేత పారిపోదు

ఏమితోచనపుడు ఇంటి పనులు చేయు
చదువు పుస్తకాలు సంతసముగ
ఊసుపోక 'సెల్లు' పోసుకబుర్లతో
జీవితాన్ని పాడు జేసుకోకు

నీదు జీవితమ్ము నీ కోసమే యిది
అమృతంబు దీనిననుభవించు
జారిపోవు చేయి జాగ్రత్త పడకున్న
పిదప మిగులు ఒట్టి వేదనేను

పచ్చిమిరపకాయ బహుపసందుగ నుండు
చద్దికూడు తోడ చద్దితోడ
నంజుకుంటుతింటె నాకమ్ము వలయునా
ఆకలపుడు తింటె ఆహ ఓహొ

పరులమేలు కోరు నరులు నడచినట్టి
వేల వత్సరాల నేల మనది
అట్టి పుడమినందు పుట్టి యజ్ఞానివై
మచ్చ తెచ్చు పనులు మానుకొమ్ము

'కోర్కెదీరగానె కోర్కె లింకనుబుట్టు'
నాడు నుడివిరట్లు నార్లవారు
ఒక్కనాటికైన చుక్కపెట్టగలను
తృప్తిమించు కోర్కె యిలనుగలదె

అడ్డదిడ్డమైన ఆలోచనలు కూడి
విషపు సంస్కృతి యిల విత్తుకొనియె
ఎదురులేనితనపు ఏలుబడిజమాన
మారగలదు ప్రజలతీరుబట్టి

కోర్కె పుట్టినపుడు కొందరికప్పుడు
కొండముచ్చుకూడ కోమలాంగె
మహిళ మనసునెరిగి మసలుకొనెడివారు
యుగముకొక్కడైన ఉంటెఒట్టు

ముదము కలిగినపుడు మదముహెచ్చినపుడు
మనిషి తనపు జాడమరచినపుడు
వింత జంతువగును వికృతంబుగమనిషి
వీలు చిక్కగానె విలువరోసి

మనసు మర్కటమ్ము పనిలేదు దేనితో
ఒంటరిగను వుంటె తుంటరేసు
శిక్షణిచ్చిన క్రమ శిక్షణగనె నుండు
మనిషితనము జూపు మాట వినును

ఆయికుడుముతింటె ఆరోగ్యమైనను
తినును పిల్లగాళ్లుననరుగాను
వయసు మల్లినంత వాటినే తినగోరు
మొదటవలదను రుచి పిదప ప్రీతి

చిన్నిచిన్ని ఆశలన్నవియేగాని
పెంచుకోకు పెద్ద వాంఛలేవి
కోరుకొనుము అన్ని తీరవీలున్నవే
ఫలితమెట్టిదైన కలతపడకు

సత్యమాచరించి స్వాచ్ఛతగానుండి
సాటివారిపట్ల సమత మమత
పేద ప్రజలపట్ల ప్రేమజూపినయట్టి
'సోనుసూదు' ఇలను భానుడందు

వృత్తినందునతగు కృషిని సల్పెడివారు
కానిపించకద్దు రాను రాను
నాణ్యముండదు పని నైపుణ్యముండదు
పైసపైనె ధ్యాస పనినగాదు

సాధనంబు చేయ సౌలభ్యమెంతయో
కష్టమగును పిదప ఇష్టమగును
కరతలామలకము క్రమముగేదైన అ–
భ్యాస మన్న యెకద కూసు విద్య

చట్ట మెక్కడైన చుట్టమే నెయ్యమే
పాలకులకు వారి వాలములకు
పార్టి లేవయినను పద్దతంతొక్కటె
బడుగు వారలిట్లు బతుకు టెట్లు

పంచ భక్ష్యములను పలహారములుగను
తినుటయన్న మాట దేవుడెరుగు
కడుపు కింత కూడు కంటి నిండుగ నిద్ర
దుర్లభమ్ముకాదె దొరక నేడు

మానవాళి భాష మాయమౌబోతుండె
'నానొ' భాషయుగము నడుచుచుండె
సుధల సౌరభాల పదములపులకింత
కమ్మనైన తెనుగు కనము యికను

మాటపుట్టె మొదట మనిషి అవసరాన
పాట పుట్టె నటులె ఆటలందు
సాహితీ రచనలు సంఘమందే పుట్టె
ఊడి పడవుయేవి ఉత్తినేను

కవిత లల్లగలదు కల్లోల జీవియే
కథలు చెప్పగలదు కష్టజీవి
బరువు గుండెవాడె బతుకు రాయగలదు
నూనె వచ్చినట్లు గానుగందు

అంకురించుచున్న ఆలోచనలనన్ని
ఆశయాలుగాను ఆచరణలొ
ఆత్మశక్తి కలిగి అమలు చేసెడివాడు
జాతిరత్నమౌను జగతినందు

చర్చకూడనదొక సంభాషణమ్ముయే
నిజము – జ్ఞానమందు నేర్వవచ్చు
వాదనంటె అదొక వదరుబోతుతనమె
జ్ఞానమబ్బుటందుకల్ల గనుము

ఆడవాళ్లుయంటె అంగలార్చుచుఅనుండు
ఏమి చెప్పు చెవికి యెక్కదసలు
రావణాసురునకు రసిక వారసుడేను
తప్పు తెలుసుకోడు తనకు తానై

భర్తయనెడి వాడు భరియించవలెగాని
భార్య భారమనుట భావ్యమగునె
పాలికెప్పుడైన పాలించవలెగాని
ఉసురు పెట్ట తగదు అసురుడౌతు

భార్యభర్తలనెడి బాంధవ్యమేమిన్న
ఎందరున్న చుట్టు నేమిఫలము
ఇట్టిమాటలెపుడు ఎదనందు మెదిలితే
కావ్యసుధలుగావె కాపురాలు

ప్రేమయనెడి మాట రెండక్షరాలైన
వినులవిందుగుండు విన్నయంత
ప్రేమకారకమ్ము యితమిత్థమనిలేదు
వివిధ వ్యక్తులందు వేరుగుండు

పంచవలయు ప్రేమ తెంచుకొనుటకాదు
వాంఛకాదు రసిక వలపుకాదు
అమలినమయినట్టి అనురాగమున్నట్టి
హృదయ భాష మిగుల మృదుల భా

కష్టమొచ్చినపుడు కంటినీరుతుడిచి
బాధకలిగినపుడు భద్రతొసగి
ఆపదొచ్చినపుడు ఆదుకొనెడివాడు
భర్తయన్న పేరు బడయగలడు

పరిసరాలనెపుడు పరిశుభ్రతగనుంచి
మాస్కువాడుచుండు మార్చి మార్చి
దుఃఖముపశనంబు దూరాన్నిపాటిస్తె
'మారి' పారిపోవు మననువీడి

కొంతమంది ప్రజలు కోవిదు టీకాను
వేసుకొనకవేయు వెనక అడుగు
వ్యాధి ముదిరినాక వగచి లాభం బేమి
తీసుకొనుడు రెండు డోసులున్ను

ఒడిదుడుకులుయుండు ఒంటరిబ్రతుకందు
అనుభనీయులున్న ఆర్చు తీర్చు
నేర్చు చూపి మెలగు నీదె జీవితమంత
కాడి విడిచి బోక కనులు తెరువు

యువత నడకనందు ఉజ్వల భవితకై
అనుభవైక శక్తి అవసరమ్ము
మమతలెరిగినట్టి మలి సంధ్యజీవులే
పెద్ద పుస్తకాలు శ్రద్ధపెడితె

అది ఒక గెలుపేన ఆత్మసాక్షిగనుడు
హేళనాయెగాదె ఎన్నికన్న
చచ్చినట్టి వారు వచ్చి ఓటేస్తిరి
ఇంతకన్నయేమి వింతగలదు

అడ్డు చెప్పినంత అంతమే బలమున్న
బతుకులేదు ఎంత బలగమున్న
స్పర్శ స్పందనున్న చరమగీతంబేను
సరిగమలపదనిసల సంచితాలె

పంచభూతములను ప్రకృతి ప్రసాదించి
సర్వజీవులయెడ సమముగుండి
జీవులన్నిటికిని జీవవైవిధ్యపు
కవచమందజేసికాపుకాయు

ఖర్మపట్టిపీల్చు కాస్తైన దయలేక
కాలపురుషుడెంత కఠినడోయి
ఇచ్చినట్టు యిచ్చి తృప్తిలగానిపోవు
కర్మ ఫలము నుండు మర్మ మిదియె

అందచందములవి అనుభూతి గతములు
మేనిబూమె ఒత్తి మేలిముసుకు
స్వాచ్ఛతున్న ఆత్మ సౌందర్యము విరియు
స్థిరమునొంది యశము చిరముగుండు

రేపటి భయములను ఇపుడె తలచుచున్న
ఇపటి సంతసాలు ఇంకిపోవు
భయమువీడువాడె బ్రతుకులో సుఖపడు
భయముగాంచ బతుకుభారమౌను

'నేషనె'ట్టిదైన నేతలే నిర్మించు
ప్రజలనుండి వచ్చు వారలైతె
ధృడముగున్నవేర్లు ఇచ్చుతరువుమల్లె
జనత బలమె నేత ఘనతయౌను

అన్య శక్తులందు ఆధారపడిగాక
స్వంతబలము కలిగి వన్నెకెక్కు
సాధనంబు చేస్తె సామర్థ్యమునుజూపి
యశము వచ్చి నీదు వశముగాదె

చేయబోయెది మనచేతిలో లేకుంటె
ఊరుకొనుట యెంతొ ఉత్తమంబు
జరగబోయెదెట్లు జరగకమానదు
కాదు అవును యనుచు కయ్యమేల

ఖాలి లేదనంటు వీలుకాదనియని
వచ్చినట్టి 'ఛాన్సు' వద్దనంటు
వగచి ఫలితమేమి పనిలేని యప్పుడు
కాలి వద్ద పనిని కాలదన్ని

బట్టమురికి పోవు బెట్టినంతనెరేవు
చెత్తతొలుగురోజు చిమ్ముతుంటె
మలినమైన మనిషి మనసులోభావాలు
ఎట్లుపోవునయ్య ఎరుకగల్గు

రండి రండి యంటు రమ్మంటు పిలుచుచు
వదలరైరి నాడు వచ్చువరకు
పదవి వీడి నంత పలకరించరెవరు
ఇంట బెల్లమున్న ఈగలుండు

కదలక నిలబడితె గమ్యమ్ము వచ్చునా
అడుగులు అటువేసినపుడె వచ్చు
తలచినంతనేది తమకు దక్కదెపుడు
పనిని చేసినపుడె ఫలితముండు

పూలకొట్టునందు మాలరేటెంతన
కులము పేర తనను పిలిచెనంటు
కొంతమంది ఘనులు కోరి తగవుపెట్టు
ఆచితూచి మాటలాడుమేలు

నీదు బాధకెవరు నిజము కారకులైన
హాని చేయవలదు – అవధరింపు
చెడ్డవాన్కి మేలు చేయునంత మనము
మార్పుచెంది తిరిగి మంచి చేయు

డబ్బు దస్కముండి డాబు దర్పంబున్న
వారలింటజరుగు ప్రతిది వార్తె
ఏమి లేని యింట ఎట్టి ఘట నయిన
ప్రక్కవానికైన పట్ట దసలు

నోరు నందు నున్న ఆరు అంగుళముల
నాలికెపుడు అదుపునందునుంటె
ఆరు అడుగులున్న భారి కాయమ్ముకు
జరుగబోదు ఎట్టి చెరుపు గనుము

అవును అన్నచోట అవుననే అనవలె
కాదు అన్న చోట కాదుయనుటె
అటులకాక తాను అటునిటుయన్నచో
ప్రజలముందు నతడు పలుచనౌను

విలువలున్నవాడు వినయంబుగానుండు
వినయమున్న వాడు విద్యనేర్పు
విద్యనేర్పువాడు విజ్ఞత కలిగుండు
విజ్ఞతున్న చోట విలువలుండు

అతిగ మాటలాడ హాని ఒక్కోసారి
మితపు భాషణమ్ము హితముగూర్చు
అన్నివేళలందు అతి అనర్థకముయె
హద్దునందునున్న హాయి కలుగు

గొప్పతనము ఎంత గొప్పగా నున్నను
గొప్పదైనదంత గొప్పకాదు
నెమలి రూపమెంత నెమ్మిగానున్నను
గళము విప్పరోత కలుగుగాదె

కప్పిపుచ్చరాదు తప్పులనెన్నడు
అందువలన వచ్చు నాపదెంతొ
చెప్పి చాటవలదు గొప్పలనెప్పుడూ
నష్టముంది అందు నమ్ము నిజము

ఆశయాలు వుండు నందరి మదినందు
అందు నాలొసించు కొందరేను
అందు కొద్దిమందె ఆచరించెడివారు
జ్ఞప్తినుండతగ్గ జనత వారు

జ్ఞానమున్న వాడు కలిమిత్యాగముచేయు
కావలించు కీర్తి కాంతనతడు
త్యాగఫలము వచ్చు తమవెంటననుచు – అ
శాశ్వతమ్ము అనును సంపదెపుడు

వినుడు మంచి మాట కనుడు మంచితనము
చేయు మంచి పనిని చెప్పు మంచి
మంచితనముకివియె మార్గదర్శకములు
మంత్ర పుష్పములని మరువకండి

రత్నమెన్నడైన రాజుకై వెదుకునా
వెదుకుచుండురాజె ముదము కలిగి
పచ్చదనపు చెట్టు ప్రాకులాడకయేను
పక్షులెన్నొవచ్చి వ్రాలినట్టు

ఆత్మశక్తి మనిషి కత్యంత ముఖ్యమ్ము
కష్టములను మలుచు ఇష్టములుగ
పట్టీలాగుచుంద్రు పలువురుఒక్కటై
తట్టుకొనినిలబడు తరువుమల్లె

విజయ మొందనపుడు విలపింపకూడదు
పోవ తగదు జారిపోయినంత
నిబ్బరంబుగున్న ఇబ్బందులవెపోవు
ఆకు రాలినాకె ఆమ నొచ్చు

అదుపుపెట్టుకొనుము అహము అసూయను
కానివొ అవి మనను కాటువేయు
ఒత్తిడెక్కువైన ఓర్మిని కోల్పోయి
మానవతను మరచి మసలరాదు

ఇచట నె ఉదయించె ఎందుకనెడి ప్రశ్న
ప్రశ్నవలనె మంచి ప్రభవమొందు
ప్రశ్నలేనిదెట్లు ఫరిడవిల్లు ప్రగతి
ప్రశ్నవేయనిపుడు పాపమాయె

మంచితనము గనుము మనుషులందరిలోన
మనలొకూడ పెరుగు మంచిగుణము
మంచితనమొకటియె మానవాళికి శోభ
మరువరాదు ఎవరు మంచినెపుడు

నదులనిండ నీరు నది తాగదెన్నడు
పాదపములు తినవు పండ్లనెపుడు
ఇట్లు సేవ జేసి ఏది నాశించని
వారు ధన్యులయ్య వసుధనందు

ఇయ్యుదుయును నేనె అయ్యుదుయును నేనె
అనెడి వాడు కాడ అసలు ఏది
నేను తనము తనకు లేని వాడే నేను
అహము విడిచినపుడె అసలు "నేను"

ఆక్సిజనుయులేక ఆవిరైపోయిన
ఒక్క ప్రాణి వుంటె ఒట్టు నమ్ము
పాత్రికేయులార పగయేలమీకిలా
ఎట్లు మనసు ఒప్పె నిట్లు రాయ

నింగి నీటిచుక్క నీ చేత బడ్డచో
దప్పికమ్ము దీర త్రాగవచ్చు
ఆలు చిప్పనబడి అవుతుంది ముత్యంబు
పంకమందు పడితె పంకిలంబె

మనిషి తనదు బాధమరొకరితో పంచు
మనసులోని బెంగమాయమౌను
ఒకరికొకరితోడు ఓదార్పునిచ్చును
హితులు లేనినాడు హితము లేదు

కొండలైన తరుగు కూర్చొని తిన్నచో
కొవ్వు పెరుగు తుదకు కూడు కరువు
శ్రమను నమ్ముకున్న సర్వత్ర సుఖముండు
ఎక్కడైన చెమట చుక్కమిన్న

విజయ శిఖరమెక్కి విజయమందుకొనగ
సాధనంబు వుంద శ్రమను మించి
దీని గుట్టుమట్టు దీక్ష పట్టుదలలె
కష్టపడనిదేది కలిసి రాదు

జీవన సరళెంత పావనంబుగ నుంటె
జీవిస్థాయి అంత శ్రేష్ఠమౌను
నియమనిష్ఠలుండి నిర్మలంబుగనున్న
సాధుజీవితమె తుషారమాయె

విత్తనాల ధరలు విపరీతమాయెను
ఎరువు కూలి రేట్లు పెరిగిపోయె
కరువు కాటకములు కల్తీ ఎరువులతొ
సాగుచేయ రైతు సాహసంబె

తాను పస్తులుండి తాలిబొట్టును అమ్మి
అవని జనులకింత అన్నమొసగి
సాగు చేసి రైతు సంపద సృష్టించు
తనకు బతుకులేక తనువు బాయు

పనిని బట్టి కూలి పనివాడు తాబొందు
రేటు కట్టు వస్తు సృష్టికర్త
ధరను పెట్టలేదు ధరణిందు రైతుయే
ఇంతకన్న ఘోరమేమి వుంది

సాగుచట్టములని చాల జేసె ప్రభుత
ఎకమైరి రైతులెదురు తిరిగి
సమ్మతమ్ము కాదు చట్టాలు తమకంటు
గట్టి పట్టుబట్టి గళము విప్పె

గతిని తప్పు మనసు అతిగ కోర్కెలు వున్న
ఆశయాలు తరుగు ఆశ పెరుగు
మంచి లోచనమ్ము మనిషికాభరణమ్ము
కోర్కెలందు కోర్కె కూడ దయ్య

మార్చి చూడు నోటు మాయమౌ చిటికలో
సంచి నిండవు గద సరకులేవి
పొదుపు చేద్దమంటె అదుపునుండదు ఖర్చు
గోడు వినెడివారి జాడయేడ

ధనము చెంతనుంటె ధనికుండువందురు
అటుల గాక జనుల నాదుకొన్న
బాధలన్ని బాపు భగవంతుడవుయంటు
నిన్ను ప్రస్తుతించు నిఖిల జగతి

ఊడ బెరికె నెవడు ఓజోను పొరలను
ఆకసమ్ము చెప్పు అడుగ నీవు
ఆక్రమణను జేసి అభివృద్ధి పేరిట
నరికె నెవడొ అడవి తరువుచెప్పు

ఇంత సమయ మంత ఎట్లు గడపవచ్చొ
ఒక్కసారిచూడు 'కుక్కరం'దు
వంటపొయ్యి క్రింది భగభగమంటకు
కుతకుతంటు కుళుకు కూత వేస్తు

ఈ కలియుగమంత చీకటి కాలమే
ధర్మదేవత తను దారితప్పు
మంచి చెడులు మరచి మానవత్వములేక
కులము రాజ్యమేలి కుళుకు చుండు

మతము మంచిదైతె మానవాళి హితము
కోరినపుడె దాని గొప్పదనము
మనుజ హనన కోరు మతమున్న ఫలమేమి
మతము యిపుడు మత్తు మందుగాదె

ఒకటి చెప్పితను మరొకటి చేయుచునున్న
పలచ నౌనుగాదె పదుగురందు
త్వరలొ బయటపడు వారి వంచితములు
తెలుసుకొనుట కిందు తెలివిదేల

ధరలు పెరుగుచుండె ధరలొఅదుపుతప్పి
చాపక్రింద నీటి చందముగను
ఆర్చువారు లేరు తీర్చువారలు రారు
ధరలు నదుపు చేయు దారిగనరు

కాలమన్ని మాన్పు గాయములెన్నైన
మార్పులెన్నొ తెచ్చు మనుజలందు
ఓర్మి కలిగియున్న కూర్మి చేకూర్చులే
ఎవవరితరము గాదు ఎదురు ఈద

గొప్పదనము గూర్చి చెప్పి మురియరాదు
మంచితనము జూపి మసలుకొమ్ము
మాటలెటులయున్న మంచి పనికిసాటి
ఏది లేదు యిలను ఎందుగనము

అంతు పట్టనట్టి ఆవిష్కరణలతో
వృద్ధి జరుగుతుండె ఎంతొకొంత
అయిన అట్టడుగుల కందుబాటులేక
వ్యర్థమగుట కొంత వాస్తవంబు

తన్ను తాను తెలుసు కొన్నవాడే కాదు
తనను తాను మలుచు కొనినవాడు
మనిషి తనము జూపి మానవుండేయగు
జీవితమును తెలియు జీవుడందు

డబ్బు పోతె పోయె దండు గౌతుం దంతె
నలత వున్న ఒంటి కలత కొంత
మాట తప్పితేను మనిషి శీలము పోవు
మరచి పోవ తగదు మాట విలువ

విజయమునకయిన అపజయమ్మునకయిన
కారణంబు దాని కతన మనమె
మనము చేయు పనులు మనదు ఆలోచనే
మనకు గూర్చుగాదె మంచి చెడులు

నీవు పొందు భయము నీలోనె అణుచుకో
బయటపెట్టబోకు పదుగురెదుట
ధైర్యసాహసాలు సౌర్యప్రతాపాలు
చాటవచ్చును సహచరులముందు

గొప్ప మాటలేవి చెప్పబోవను గాని
కవుల నాదరించు కవితనిలుచు
ఇచ్చు యిచ్చ వున్న యిష్టపడుతునిచ్చి
సాహితి అభిలాష చాటుకొనుడు

గద్యరచన వీడి పద్యమెందువలన
వ్రాయుచుంటి వంటు వచన కవులు
అడుగ – కవికి రచనలన్నియు ఒక్కటే
పద్యరచన నాకు హృదయందు

పామరుండుమెచ్చె భాష్యకారులుమెచ్చె
పండితులుయు కొంత అండనిచ్చె
నాదు శతకములను నచ్చి మెచ్చిరిఎంతొ
చాలు జన్మకిట్టి సంతసమ్ము

ఆదరించి రెంతో "అక్షరం ఆర్చు"ను
ఇరువ దైదు యేండ్లు ఇష్టపడుతు
సాకిరెంతొమంది సహకారమందించి
అందరందరికివె వందనాలు

## అమాయకుడు అప్పన్న

(కథ)

అనగనగా ఒక ఊరిలో అప్పన్నఅనే అమాయకుడు ఉండేవాడు .ఆ ఊరి బడి కరోనా వలన మూత పడటంతో ఆన్ లైన్ తరగతులు ప్రారంభించారు .అప్పన్న కొడుకు సుబ్బన్నకు ఆన్ లైన్ తరగతిలో పాల్గొనడానికి సెల్ ఫోన్ కావలసి వచ్చింది. సెల్ ఫోన్ కొనడానికి అప్పన్న పట్నం వెళ్లే లోకల్ ట్రైన్ ఎక్కాడు.

పట్నంలో స్టేషన్ బయటకు రాగానే దొంగ వృత్తి చేసే దొరబాబు దగ్గరకు వెళ్లి " అయ్యా ,రాజు మొబైల్స్ ఎక్కడండీ. అక్కడ నాణ్యతగల ఖరీదైన సెల్ ఫోన్ అమ్ముతారంట, మా పక్కింటి పరంధామం మిత్రుడు రాజు మొబైల్ అంగడి యజమాని . " అంటూ తన వివరములన్నీ అడగకపోయినా అమాయకంగా చెబుతున్న అప్పన్నను చూడగానే ఒట్టి అమాయకుడని తెలుసుకున్నాడు

అక్కడే వున్నా రాజు మొబైల్స్ అంగడి చూపించాడు .అప్పన్నఅంగడి లోనికి వెళ్ళగానే అతని దగ్గరనుండి ఆ సెల్ ఫోన్ ఎలా తీసుకోవాలని ఆలోచించాడు .తన ఇద్దరు మిత్రులను పిలిచి అమాయకుడైన అప్పన్న గురించి చెప్పాడు

" అమాయకుడైన అప్పన్నని సులభంగా మోసం చేసి ఆ సెల్ ఫోన్ తీసుకోవచ్చు " అన్నాడు దొరబాబు

ఆ సెల్ఆ ఫోన్ ఎలా తీసుకోవాలని ముగ్గురు దొంగలూ అలోచించి ఒక నిర్ణయానికి వచ్చారు .

రాజు మొబైల్స్ యజమాని దగ్గరకు వెళ్లి పరంధామం వ్రాసిన ఉత్తరాన్ని ఇచ్చాడు. ఉత్తరం చదివిన తరువాత అప్పన్నను సాదరంగా ఆహ్వానించాడు రాజు .

అంగడి నుండి బయటకు రాగానే దూరంనుంచే ముగ్గురు దొంగలూ చాటుగా చూడసాగారు . అప్పన్న టికెట్ తీసుకొని తమవూరికి వెళ్లే లోకల్ ట్రైన్ ఎక్కాడు .బండి కదిలే సమయానికి ముగ్గురు దొంగలూ బోగీలోనికి ఎక్కి అప్పన్న ప్రక్కన కూర్చొన్నారు

దొరబాబును చూడగానే " ఇరవై వేలకే ఇచ్చాడు "అంటూ తన చేతిలోని సెల్ ఫోన్ బాక్స్ చూపించాడు

" ఇది డూప్లికేట్ ఫోన్ . ఒరిజినల్ సెల్ ఫోన్ బాక్స్ ఇలా ఉండదు. కావాలంటే విప్పి చూడండి ." అన్నాడు దొరబాబు

విప్పాడంటే తన దగ్గరున్న పాత సెల్ ఫోన్ ఎలాగోలా అందులో పెట్టి కొత్తది దొంగలించాలనుకొన్నాడు.

"ఎల్లుండి మంచి రోజు. ఇంట్లో దేవుడు ముందు పెట్టి వుంచుతాము. ఎల్లుండి మా అబ్బాయి విప్పి చూస్తాడు . ఈ సెల్ ఫోన్ ఐదువేల రూపాయలు తగ్గించి ఇచ్చాడు "అంటూ జేబులోనున్న బిల్ చూపించాడు అప్పన్న.

" డూప్లికేట్ కాబట్టే ఒకే సారి ఐదువేలరూపాయలు తగ్గించాడు . ఒరిజినల్ అయితే వెయ్యిరూపాయలు పైన తగ్గించడు. బాగా మోసం చేసాడు . దీని ధర రెండు నుండి మూడు వేల రూపాయలవరకు ఉంటుంది . ఈ ఫోన్ ఆన్ లైన్ తరగతులకు ఉపయోగపడదు " అన్నాడు రెండవ దొంగ

" ఇది నిజమైన సెల్ ఫోన్ "అంటూ కోపంగా అన్నాడు

"చిన్న పిల్లాడైనా ఈ పెట్టెను చూడగానే డూప్లికేట్ అంటూ చెప్పగలడు. ఒరిజినల్ సెల్ ఫోన్ పెట్టె ఇలా ఉండదు. నేను ఇలాంటి ఫోన్ కోసమే ఈ పట్నానికి వచ్చాను. రాజు మొబైల్స్ తప్ప మిగతా అన్ని అంగళ్లలో అడిగితే వచ్చే వారం వస్తుందన్నారు" అన్నాడు మూడవదొంగ.

'అంత డబ్బు పెట్టి కొంటె వీడుకూడా డూప్లికేట్ సెల్ ఫోన్ అంటాడేమిటి ' అని ఆలోచించాడు .చివరకు వారి మాటలు నిజమని నమ్మాడు .

"అయ్యో ...నేను మోసపోయానే ఇప్పుడెలా"బాధగా అన్నాడు అప్పన్న

" మీకు అభ్యన్తరం లేకుంటే మూడువేల రూపాయలకు అది కొంటాను .కొంతవరకైనా మీకు నష్టం తగ్గించినట్లవుతుంది "అన్నాడు మూడో దొంగ

అప్పన్న తన దగ్గరున్న సెల్ ఫోన్ బాక్స్ ఇచ్చి మూడువేల రూపాయలు తీసుకొంటూ "నాకు పదిహేడువేల రూపాయలు నష్టం "బాధగా అన్నాడు

ఆ ముగ్గురూ ప్రక్క స్టేషన్ నందు దిగి వెళ్లిపోయారు

అప్పన్నతన ఊరు వచ

## నిప్పురవ్వలు



జీవిత ప్రయాణం
చీకటి నుండి
వెలుగు దాక-
వెలుగు నుండి
"మహోజ్వాల" దాక!



అగరువత్తిలా
నువ్వు నా జీవితంలో
పరిమళాలు వంపుతుంటే
కొవ్వొత్తిలా
నేను సమాజానికి
సూర్యుళ్ళను నింపుతుంటాను



కరుణించని
కాలయంత్రం
పరుగెత్తుతోంది-
కనిపించని
జీవన ప్రయాణం
గతి తప్పుతోంది!

పెళ్లి అయినా
కాకపోయినా
జీవిత ఫ్రేములో
అన్యోన్యంగా యిమిడేది
ప్రేమికులే

వికలాంగులైన
నేటి జనం చేతిలో
సెల్‌ఫోన్ దర్పం-
విద్యుదయాస్కాంత
కిరణాల చితిలో
దహించేను ఆ సర్పం!

రాత్రి అనక
పగలనక
చిరు దీపంతో
వధువును వెతుక్కోవడం వెట్టి-
పెళ్ళి అయ్యా
పిల్లలయ్యాక
(చీకటి) బ్రతుకులో
మళ్ళీ "వర్రీ" అనడం
వెట్టియే మరి!

– డా॥ విప్లవ్‌దత్ శుక్లా
సెల్:9849185878

## పుస్తక సమీక్ష

# అలరించిన "ఆదిలాబాద్ నానీలు"




ఆయన ఉదారి నారాయణ. "ఆదిలాబాద్ నానీలు" రాసినాయన. 'కండ్లలో జాలి / కడుపులో ఖాళి / అని ఆదిలాబాదీయుల గురించి ఆర్ద్రంగా చెప్పినాయన. "వాక్యాలు / దారాలనిండా / కవితాక్షరాలలో / ముత్యాల దండ" అల్లినాయన. రాయకపోతే కాగితం వెలవెలబోతుందని, కలం విదిలిస్తే చిత్ర వర్ణాలతో శోభిస్తుందని, కవిత్వానికి వస్తువు ముఖ్యం సగీషీలూ ముఖ్యమేనని తెలిపినాయన. అయితే కొందరు మాత్రం "రచన జానెడు – ప్రచారం మూరెడు" అన్నట్టు సొంత డబ్బా కొట్టుకుంటరు, ఫేస్‌బుక్‌లో పెట్టుకుంటరు అని తూర్నారబట్టినాయన.

"మంచు దుప్పటి / కప్పుకున్న చంద్రుడు / సూర్యుడంటే / అంత సిగ్గు మరి" "వానకు ముందు / ఉరుములు మెరుపులు / మేఘాల / పురిటినొప్పులు" "వర్షంలో / వంగిన పూలకూసలు / కన్నందుకు / మట్టికి వందనమేమో" "అధ్యాపకులూ / రైతులే / మెదళ్ల బీళ్లలో / జ్ఞానాన్ని పండిస్తరు'' అని ఉదారినారాయణ నానీలను భావుకతతో రాసిండు. సినారె ''ప్రబంధంలా మెరిసిండు / పద్యంలా నవ్విండు / పాటలా బతికిండు'' అని మూడు పంక్తుల్లో ముచ్చటగా చెప్పిండు. "ఒక్క సమోసాను / ఇద్దరు తినడమా / అయితే అది / అద్భుత సమానమే'' అని చమత్కరించిండు.

"గాయమైనా / కాయం హూణమైనా / పిల్లలేకదా / తల్లికి ప్రాణం" ఇందులో తల్లి సేవ, కష్టం, త్యాగం, ప్రేమ అన్నీ మిళితమై ఉన్నాయి. "పెండ్లికి ముందు / పెదవులు ఎర్రగా / పెండ్లయినంక / కండ్లు ఎర్రగా" ఇందులో పాఠకులు ఒక్కొక్కరూ ఒక్కొక్క విధంగా ఎంతైనా ఊహించుకునేట్లు బలేగా రాసిండు.

"పిల్లల కోసం / వత్తిలా కాలుతున్నరు / వాళ్ళేమో / మత్తులో తేలుతున్నరు" తల్లిదండ్రులు తమ కోసం త్యాగాలు చేస్తుంటే, అది గుర్తించని యువత మత్తులో జీవితాలను చిత్తు చేసుకుంటున్నరు. ఎందరో సుఖాలకోసం తండ్లాడుతరు. కాని, జీవితం గెలుపు ఓటముల ఆట అంటడు ఉదారి నారాయణ. "ప్రతి గడియ / అనైతికంగా సుఖిస్తే / మరణం / భయంకరమే" అని హెచ్చరిస్తడు. గర్వం పతనానికి పూసే ముండ్లపువ్వంటడు. కరోనా కొమ్ములనైనా పెరుక గలమేమో కాని కులం కోరలను పెకిలించలేక పోతున్నావని మథనపడుతడు. కాకులను చూసి – అరువులను కాదు, ఐక్యతను నేర్చుకొమ్మంటడు. "పని లేదని / ముడుచుకొని / పండుకోదు ఫ్యాను / ఎప్పుడు విలిచినా సిద్ధమే'' – సోమరిపోతులకు వ్యంగ్య విసురు ఈ కవిత.

నారాయణ నానీలలో సామాజిక విషయాలు ఎన్నో ఉంటయి. "పుట్టలో పాలు పోస్తేనే కాదు పేదల పొట్టకు నీళ్లిచ్చినా భక్తే'' అని మానవతను చాటుతడు. తెలంగాణలో నేడు 'జయజయహే పాట' వినిపించడం లేదేమని ప్రశ్నిస్తడు. పేదపిల్లలకు అందాల్సిన పాలు క్షీరాభిషేకాలుగా నేల పాలౌతున్నాయని ఆవేదన చెందుతడు. "అలల పోరాటాన్ని ఆపడం సముద్రతరం కాదని, అలాగే ప్రజల ముందు నువ్వూ అంతే" అని అధికార బధిరాంధులకు సవాలు విసురుతడు. ఆకలి ఎరుపెక్కితే కన్నీళ్లు కదం తొక్కుతాయని కరాఖండిగా చెప్తడు.

మన మాతృభాష తెలుగు. తెలుగులో స్పష్టంగా రాయగలగాలి. కాని ఎందరో తప్పులు రాస్తున్నారు. "తెలుగు / వెలుగుతుంది గోడలపై / తలలేక కట్లులేక / దీర్ఘాలు రాక" అని బాధ పడుతడు.

ఉదారి నారాయణకు పుస్తకాలంటే ఇష్టం. "ఈ మూన్నాళ్ళు / నగరం సంస్కారవంతంగా / సారవంతంగా / పుస్తక ప్రదర్శన కదా" అని సంతోషిస్తడు. పుస్తకాల సంభాషణ / నిశ్శబ్దమైనా / వేల భావాల్ని రగిల్చే / భాస్వరాలు" అని తెలియజేస్తడు.

డా॥ ఉదారి నారాయణ ముందు ముందు మరిన్ని మంచి పుస్తకాలు వెలువరిస్తాడని ఆశిస్తూ...

అభినందనలు.....

**ప్రతులకు :**
ఉదారి నారాయణ
94414 13666

– ఎ. గజేందర్‌రెడ్డి
సెల్: 9848894086

## వాస్తవ వాదం

నా వాదం మహామొండిది
కరిగించిన బంగారంలా వాస్తవం
నిజం పక్కన నిలబడుతది
వినిపించడానికి న్యాయవాదులెవరూ లేరు
వకాల్తా పుచ్చుకొని వాదించరు
నేనే గొంతు విప్పుతా, గొంతెత్తుతా

నా వాదం ప్రశ్నల మయం
నిలదీసి నిలువెల్లా కడిగేస్తది
బెదిరింపులకు లొంగదు
ఆశ చూపితే తలొంచదు
దాడులను ఎదుర్కోవడానికి సిద్ధం.

నా వాదం నిప్పు
గాలి తోడైతే వ్యాపిస్తుంది విశ్వమంతా

జనం పైకి చల్లిన విత్తనం
ఆలస్యంగానైనా అల్లుకుపోయే తీగ.

ఆ వాదాన్ని ఎదుర్కోలేని వాళ్ళు
తొండి కేసులతో బంజరుదొడ్లో వేస్తారు
చేస్తారు నోట్లో నాలుక లేకుండా
వాదాన్ని సమాధి చేసి సిమెంట్ తో మెత్తేస్తారు
సమాధి పక్కన
నాలుగు గడ్డిపరకలు మొలిస్తే భయం.

ఎన్ని చెదపురుగులు వెదజల్లినా
జనంలో చల్లిన విత్తనాలు
ఎక్కడో ఒకచోట మొలకెత్తుతాయి
నా వాదం మెల్ల మెల్లగా లేస్తుంది
అందరిని నిద్ర లేపుతుంది

–కొమురవెల్లి అంజయ్య
9848005676

## మెగాసిటీలో

మెగాసిటీ నడిబొడ్డులో రోడ్డుపక్క పేవ్‌మెంట్
క్రింద మందుపాతర ఎప్పుడైనా పేలవచ్చు
జీవితంపై నిరాశ చెంది ఆత్మాహుతికి పాల్పడ్డ
నవవధువు హాహాకారాలు వినడాన్కి
న్యాధికారి ఎప్పుడైనా పరిగెత్తవచ్చు–

ప్రతి నిరసన జనసందోహాలను కదిలించవచ్చు
ప్రతి ఘడియ మారణహోమాలను వెలిగించవచ్చు
పశుబలమే శాసనమైతే కనుచూపులో శాంతి ఎక్కడ?
నిజంగా
ప్రశాంతత పరిశుభ్రత ఎప్పుడు ఎక్కడుంది కనుక?
ఈ మెగాసిటీని శుభ్రపరచండి
పడు పడు పడు– బాంబులు పడు–
ఇదే రణనినాదం!
దుర్ దుర్ దుర్– దుశ్శాసన–
ఇదే పచ్చని చెట్ల మొర!
అరటిపండు చింతపండు
గులాబీలు
తామరలు
నోరులేని భగవంతుని పసిపిల్లలు–
ప్రతి కవిది తన ఘోష తనది.
(ప్రముఖ కవి కథకుడు మునిపల్లె రాజు
ఒక ఇంగ్లీషు కవితకి అనువాదం)

–కోటం చంద్రశేఖర్
9492043348

## త్యాగ సౌందర్యం

నాన్న మా ఇంటిచూపుల వెలుగుపూల మొక్క
తన రెక్కల తపన కుటుంబ ప్రయోజకత్వం
మమ్మల్ని ఎత్తుకొని, ఎగరేసి ఆకాశాన్నందిస్తడు
ప్రపంచపు సుఖ దుఃఖాల్ని పరిచయం చేస్తడు.

సమస్యల సుడిగాలుల్లో
స్థిర తరువై వేళ్ళూనుకుంటడు
బురద నేలల్లో, ఈదురు వేళల్లో
నడక ఆపని బహుదూరపు బాటసారి.

మబ్బుతెరలు దాచేసినా
రాత్రిమాయ మరిపించినా
అలసిపోని స్వేదాన్ని ధారపోసి
మనసుపొరల్లో అనుబంధాల్ని పేర్చి
పంటనీడల్లో సేదదీర్చు నాన్న
ఓర్పుకూ ఓదార్పుకూ
బాధ్యతకూ బంధానికీ
మనిషిరూప మహావృక్షం.

ఆశల పూదోటకు కాపలాదారుడు
పచ్చనాకు పందిరై పరిసరాలకు ప్రాణమౌతడు
నిరంతర ప్రేమజీవన ప్రవాహం
మేం తోడుగ పరుగెత్తే పిల్లకాలువలం
అమ్మ భూదేవి
మరి నాన్న ఆకాశమంత
ఆమె అనురాగం సరస్సు..
ఆ సరస్సు చుట్టూ నాన్న ధీటైన కొండగట్టు..

– వనిపాకల లచ్చిరెడ్డి
9966897001

## సరికొత్త బంధం

కట్టుగా కట్టిన కట్టలో నుంచి
ఒక్కొక్క పుల్ల జారిపోతున్నది
చేజారుతున్న వాటికి చేతిని
అడ్డం పెట్టలేని నిస్సహాయ స్థితి.

అతుకుకొని సాగిన బంధం
భాష్పీభవనం చెంది గాలిలో కలిసింది
భుజానికి బరువు కాలేక దేహం
సామూహికం లోకి చేరిపోయింది.

కట్టెతో కట్టెను తాకలేక
కన్నీరు వరదై ఒడిని తడిపింది
ఆడించిన గుండెల మీద
గుప్పెడు మట్టిని చల్లలేని దౌర్భాగ్యం
అంతరిక్షానికి నిచ్చెనలేసిన విద్వత్తు
వినాశనానికి ఆనకట్ట వేయలేక పోయింది
ఎటుచూసినా ఒంటరి వేదనలే
దరిచేర దారిలేని విషన్న వదనాలే

జాలి మాలిన దైవం ఆడిన చదరంగంలో
బాలింతరాలు బలిపశువయింది
అమ్మ ఆకాశాన్ని కావిలించుకుంటే
పొత్తిళ్ళు ప్రశ్నలై వెక్కిరించిన వేళ

నిందలు మోసిన
అప్రజాత ముందుకు కదిలింది
అనాథదు అమృతనం
వరమిచ్చాడనుకుంది
ఒకరి లోటును మరొకరు తీర్చుకున్నారు
చిట్టి చేతులు కొత్త తల్లిని చుట్టుకున్నాయి
సరికొత్త బంధం ఆవిష్కృత మయింది

–శింగరాజు శ్రీనివాసరావు
9052048706

## సత్యాసత్యాలు

| | |
|---|---|
| సత్యం | శాశ్వతమైనది |
| అసత్యం | అశాశ్వతమైనది |
| సత్యం | మారనిది |
| అసత్యం | మారేది |
| సత్యం | నిత్యమైనది |
| అసత్యం | అనిత్యమైనది |
| సత్యమే | చివరికి గెలిచేది |
| అసత్యమే | చివరికి ఓడేది |
| సత్యం | భ్రమ తొలగించేది |
| అసత్యం | భ్రమ కల్గించేది |
| సత్యం | ముక్తి మార్గమైనది |
| అసత్యం | దుఃఖ మార్గమైనది |
| సత్యంలో | వెలుగున్నది |
| అసత్యంలో | చీకటున్నది |
| సత్యం | బలవంతుల మార్గమైనది |
| అసత్యం | బలహీనుల మార్గమైనది |
| సత్యంలో | బాహాటమైన బాటున్నది |
| అసత్యంలో | దొంగచాటు బాటున్నది |
| సత్యం | తలఎత్తి నిలుస్తుంది |
| అసత్యం | తలదించి నిలుస్తుంది |
| అసత్యం | ఎండమావిలాంటిది |
| సత్యం | నీటి చెలమలాంటిది |

–ఎస్ .ఎమ్ .షరీఫ్
9618045319

## నా ఊరి చెరువు

రాత్రి చీకటినే కాటుకగా దిద్ది
సూరీడునే తిలకంగా అద్ది
వెండి వెన్నెల పోగుల చీరను కట్టి
అలా నిలిచిపోయావులే
అద్దంలో నిన్ను నీవే చూసుకుంటున్నట్టు
అందమంతా నీ సొంతమే అయినట్టు
నీకు నీవే దాసోహమన్నట్టు
చేపపిల్లలతో చెంగుచెంగున దూకుతూ
కొంగలతో కొంటె చేష్టలు చేస్తూ
నీటి గలగలలు ఘల్లుఘల్లుమంటూ
కాలికి మువ్వలు తొడిగినట్లుగా నాట్యమాడుతుంటే
విడివడిన సిగ ముడి
పాయలుగా చీలి పరవళ్ళు తొక్కుతూ
అలుగులా పారుతుంటే
నందూరి ఎంకి కళ్ళ ముందు కదలాడినట్లుంది
వయ్యారాలతో వైనమేదో చూపిస్తున్నట్లే ఉంది
పదహారేళ్ళ పడుచు పరుగులు పెడుతున్నట్టే ఉంది
ముగ్ధలాగా నీ అందము మురిపిస్తుంటే
ఝల్లుమన్న గుండె జారిపోతుంటే
నింపుకున్నాయ్ నయనాలు అమాంతంగా
దింపుకున్నాయి హృదయంలోకి నిన్ను ఆసాంతంగా...

–మంజుల సూర్య,
9704022244

## యవ్వనం - వృద్ధాప్యం

యవ్వనంలో ముఖముపై మొటిమలు ఆందోళన కలిగించాయి
వృద్ధాప్యంలో ముఖముపై ముడతలు ఆందోళన కలిగిస్తున్నాయి.

యవ్వనంలో ఆమె చెయ్యి పట్టుకోవాలని తహతహలాడాను
వృద్ధాప్యంలో నాచెయ్యి పట్టుకోవాలని ఎదురు చూస్తున్నాను

యవ్వనంలో ఒంటరిగా వదలాలని కోరుకున్నాను
వృద్ధాప్యంలో ఒంటరి తనం అంటే భయపడుతున్నాను.

యవ్వనంలో అందాన్ని అందుకోవాలని ఆశడ్డాను
వృద్ధాప్యంలో అన్నిటిలో అందాన్ని చూచి ఆనందిస్తున్నాను.

యవ్వనంలో నిదుర లేవటానికి కష్టపడ్డాను
వృద్ధాప్యంలో నిదుర పోవటానికి కష్టపడుతున్నాను .

యవ్వనంలో జీవితంలోని మాధుర్యాన్ని అనుభవించాను
వృద్ధాప్యంలో ఆ మధుర జ్ఞాపకాలలో జీవిస్తున్నాను.

యవ్వనంలో జీవితం శాశ్వతం అని భ్రమపడ్డాను
వృద్ధాప్యంలో జీవితం తుదిశ్వాసకై ఎదురుచూస్తున్నాను.

– కందాళం రజనీకృష్ణ
సెల్:9487708043

## సైనికులం మేము సైనికులం

భారతమాత వీర పుత్రులం
భారతదేశ పరి రక్షకులం
మా దేహమే దేశానికి అంకితం
సైనికులం మేము సైనికులం..

వెరుపన్నదే మాకు లేనేలేదు
అది మా రక్తంలోనే కానరాదు
మాఅమ్మ పాలు మాకు అమృతం
మాఅమ్మ దీవెనలు మాకు రక్షణకవచం
సైనికులం మేము భారతదేశ రక్షకులం..

శత్రువు అడుగుల సడివింటే
జూలుదులిపిన సింహా లవుతాం
శత్రువు రొమ్ము చీల్చి ఆ రుధిరమ్ముతో
తల్లి భారతికి తర్పణ చేస్తాం
సైనికులం మేము
భారతదేశ రక్షకులం..

కంటిరెప్పలను వాల్చము మేము
మా కన్నులే మాకు కాగడాలు
దొంగచాటుగా శత్రువులు
హద్దులు దాటి చొరబడితే
భారత సింహాలమై ఖతం చేస్తాం
దేశభద్రకే మా దేహం మా ప్రాణం..

రాయిరప్పల్లో కొండాకోనల్లో
మంచుకొండల్లో మండుటెండల్లో
దారేలేని ఎడారులైనా
అన్నీ మాకు పూదారులే
అలసిపోము సొలసిపోము
అడుగులు ముందుకే వేస్తాము
భారతదేశ రక్షణే మా గమ్యం
భారతమాత సంతోషమే మా స్వర్గం

–బూర దేవానందం
9494996143

## కాలం'

కాలం కరిగిపోతుంది!
నేడు నిన్నగా మారి
శిథిలమైన అనుభూతులను
నేడుగా మారనున్న రేపటికి
అందిస్తూ సాగుతుంది!.

కాలం ఎంత నిర్దాక్షిణ్యమైనదో
ఒక్క క్షణం ఆనందానుభూతులను
అదనంగా ఆస్వాదించనీయదు!

కాలం గొప్పది కూడా
మనసు గాయాలకు చికిత్స చేసి
సాంత్వన పరచగలదు!

కాలం నైపుణ్యం కలిగిన శిక్షకుడు కూడా
సమయానుకూలంగా
ప్రవర్తించడం నేర్పగలదు!
కాలం ఎంత విశాలమైనదో
ఎన్ని యుద్ధాలు, ఎన్ని ఘోరాలు
ఎన్ని ఉపద్రవాలు,
ఎన్నెన్ని మారణహోమాలు
తనలో దాచుకుంది!.

కాలం ఎంత దయగలదో
అంత కఠినమైనది కూడా!
శూన్య హస్తాలతో నిలబడితే
ఎన్నెన్నో ఆనందాల వజ్రపు తునకలు,
మరెన్నో కష్టాలకడగండ్లూ
విదిలించి పోతుంది!.

అన్నింటికన్నా కాలం చాలా మొండిది
తలక్రిందులు తపస్సు చేసినా
వెనుతిరిగిన క్షణం
ఎన్నటికీ తిరిగిరాదు!.

అందుకే మిత్రమా!
కాలం నేర్పిన
గతకాలపు అనుభవాల గుణపాఠాలను
వర్తమానంలో పునాదులుగా మార్చుకుని
భవిష్యత్తులోకి సాగిపో
కాలంతోపాటు కదలిపో!!

–లలితా వర్మ.
9949672671.

## బమ్మెర పోతన!

పంచదార గుళికలుగా
ప్రతి పద్యం హృద్యంగా
దేనికసలు లొంగకుండ
దేవుని నైవేద్యంగా
"భాగవతము" రచియించి
రామాంకిత మొనరించి
భక్తకవిగ రాణించి
భానునిలా ప్రకాశించి
తెలంగాణ తేజంగా
వర్ధిల్లెను పోతన్న!

కన్న నేల "బమ్మెర"లో
కర్షకునిగా పొలము దున్ని
కలకాలం నిలిచేలా
కవిగానూ కావ్యమల్లి
సవ్యసాచిగా వెలిగిన
చరితార్థుడు పోతన్న!
రాజునైన ధిక్కరించి
రాజిల్లెను పోతన్న!
అందుకే మనందరికి
ఆరాధ్యుడు పోతన్న!

– డా॥ వడ్డేపల్లి కృష్ణ
సెల్: 9246541699

## కవన సెలయేరు

అమ్మ భాషంటె
జున్నుముక్క రుచిలా
ఎంత కమ్మనో.
తీయ తేనియ
పలుకుల కుప్పలే
తెలుగు భాష.
పంటచేలోని
చల్లగాలిలా తోచు
పలకరింపు.
తెలుగు రుచి
పోతన్న కావ్య గాదె
మాగిన రసం.
ఎంత రుచిరా
అన్నమయ్య పాటల
తేనెల ఊట.
జానుతెనుగు
హోయలెన్నో చూపెను
పాల్కురికి కైత.
ఎన్ని హోయలో
శృంగార శ్రీనాథము
కావ్యాల భంగి.
ఎన్ని పాయలో
తెలుగు గోదారమ్మ
యాసల నది.
చక్కని గొంతు
నీ యాసనే పలుకు
తెలుగు అందం.
ముత్యాలై రాలె
వచన కవనాలు
గిడుగు జాడ

–వకుళ వాసు
9989198334

## కాలం మారిపోయింది

కాలం మారిపోయింది
రాత్రిసమయంలో ముచ్చట్లు
తాత చెప్పే పిట్టకథలు
బామ్మ పెట్టే చివాట్లు
నాన్న ఇచ్చే చిల్లర పైసలు
స్నేహితుల ఆట పాటలు
చిన్న చిన్న అల్లర్లు గొడవలు
కోపాలు తాపాలు
చిన్నప్పుడు కట్టిన
బొమ్మరిల్లులు పిట్టగూళ్ళు
వరద నీటిలో కాగితపు పడవలు
తూనీగలను పట్టే పిచ్చి కోరికలు
చేతిపంపులో రాళ్లు వేయడాలు
ఆటలోని కిరాణా దుకాణాలు
వాటికి ఇచ్చే నకిలీ నోట్లు
రేగడి నేలతో వంట పాత్రలు
ఆ ఆటలోని అద్భుతాలు
నవ్వుతూ చేసే బొమ్మల పెళ్లిళ్లు
చీకట్లో దాగుడుమూతలు
ఆటల్లో తగిలిన చిన్న చిన్న గాయాలు
మరుసటి రోజు నేస్తం పై కోపాలు
తర్వాత ప్రేమలు ఆప్యాయతలు
ఆ నాటి గుర్తులు,
ఈనాడు మరుపురాని జ్ఞాపకాలు.

–కందుల తరుణ్
9618815325

## పుస్తక సమీక్ష

# వినూత్నరీతిలో బాలలకో బహుమతి

పిల్లలు ఆటపాటలతోపాటు కథలను కూడా ఎంతో ఇష్టపడుతారు. పూర్వకాలంలో అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు చెప్పే కథలను పిల్లలు ఎంతో ఆసక్తితో వినేవారు. అడిగిమరీ చెప్పించుకునేవారు. ఆ కథలు పిల్లలకు విజ్ఞానంతోకూడిన క్రమశిక్షణను అందించేవి. పెద్దలపట్ల మసులుకోవలసిన తీరును తెలియజేసేవి. కానీ ఆధునిక కాలంలో ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడం, పుస్తకం బదులు చరవాణి చేతిలోకి రావడం వలన పిల్లలకు కథలకున్న ప్రాధాన్యత తెలియకుండా పోతుంది. కథలు పిల్లలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని, ఆసక్తిని, ఆలోచనను కలిగిస్తాయి. అలాంటి గొప్ప కథలను మళ్లీ నేటితరం విద్యార్థులకు అందించాలనే తాపత్రయంతో ప్రముఖ




బాలసాహితీవేత్త, రచయిత్రి, ఉపాధ్యాయురాలు పురిమళ్ల సునంద "బాలలకో బహుమతి." అనే కథల పుస్తకాన్ని వెలువరించారు .

ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి పిల్లలతో గల విశేష అనుబంధం, మాతృభాష బోధకురాలిగా బోధనానుభవం, తెలుగు పాఠ్య పుస్తక రూపకల్పనలో రచయితగా పాల్గొన్న అనుభవంతో సునంద గారు ఈ కథల సంపుటిని అద్భుతంగా తీర్చిదిద్దారు. ఇందులోని కథలను ద్విత్వ, సంయుక్తాక్షరాలు లేని విధంగా రాయడం వలన కథలన్నీ పిల్లలే స్వయంగా చదివి అర్థం చేసుకునేలా ఉన్నాయి. ప్రాథమికస్థాయి విద్యార్థులకు బాలలకో బహుమతి అనే పుస్తకాన్ని సునంద గారు ఒక బహుమానంగా ఇచ్చారని చెప్పవచ్చు. ఇందులో మొత్తం14 కథలు ఉన్నాయి. పిల్లలకు ఇష్టమైన పక్షుల, జంతువుల పాత్రలతో ఈ కథలు ఉన్నాయి. ఇవన్నీ కూడా పిల్లలకు ఉత్సుకతను కలిగించేలా, స్వీయ పఠనం పెంపొందించేలా ఉన్నాయి.

'చెలిమి విలువ' కథ సంక్షిప్తంగా చూసినట్లయితే ఒక అడవిలో ఒక చిలుక, చీమ ఎంతో సోపతిగా ఉండేవి. చీమలు మనలా ఎగురలేవు, పలుకలేవు కావున చీమతో సోపతి చేయకుమని చిలుక మామ, చిలుకతో అంటుంది. రెండు మూడు రోజులు వరుసగా గాలి వాన రావడంతో చిలుకలకు ఆహారం లేకుండా పోతుంది. చీమకు తన సోపతిగాడు యాదికి రావడంతో చిలుక మామ ఏమైనా అనుకోని అని చిలుక కొరకు ఆహారం తీసుకుపోతుంది. చీమ ఆ ఆహారమును చిలుకను, చిలుకమామను తినమంటుంది. చిలుకమామ చీమను పిలిచి తనను బెదిరించినందుకు ఏమి అనుకోకూడదని, ఇంతకుముందులా మీరు కలిసిమెలిసి ఉండమని అంటుంది.

ఈ కథను చదవడం ద్వారా ఎవరినీ తక్కువ చేసి మాట్లాడకూడదని, ఎవరి గొప్పతనమును వారికి ఉంటుందని పిల్లలకు అర్థమవుతుంది. ఆపదలో ఉన్న స్నేహితుడిని ఆదుకోవడం వలన చెలిమి విలువను పిల్లలకు తెలియజేశారు. పిల్లలందరూ కలిసిమెలిసి ఆడుకోవాలని సూచించారు. మనకు కీడు చేసిన వారికి కూడా తిరిగి కీడు చేయకూడదని, ఒకవేళ వారు కష్టాల్లో ఉన్నట్లయితే సహాయం చేయాలని చెప్పి పిల్లల్లో పరస్పర సహకార భావాన్ని పెంపొందించారు.

సహాయం కథలో తేనెటీగ, కందిరీగ కలిసి బాలల నుండి తూనీగను కాపాడటం, ఉపకారం కథలో కోయిల నెమలిని వేట గాని బారి నుండి తప్పించడం, చేపలు, బాతులు, తాబేలు కథలో బాతుల దాడి నుండి చేపలను తాబేలు కాపాడటం అనే సంఘటనలు పిల్లల్లో స్నేహ భావం పెంపొందించేలా ఉన్నాయి. ఆపద వచ్చినపుడు అధైర్యపడకుండా ఆలోచనతో వ్యవహరించాలని తెలియజేస్తాయి. మంచి మనసుతో పూజ చేయాలని కపటంలేని పూజ కథ ద్వారా, ఎవరి విలువ వారిదే కథలో అహంకారంతో ఇతరులను గాయపరచ కూడదని పారిజాతం, గులాబీ పువ్వుల ద్వారా విద్యార్థులకు తెలిపిన తీరు బాగుంది.

తీరిన కోరికలో చిలుకలు బాలలకు జామకాయలు కోసి ఇవ్వడం అనేది పిల్లలకు సంతోషాన్ని కలిగిస్తే, పగలు రేయి లేకుంటే కథలో విపరీతమైన కోరికల వలన జరిగే ఆనర్థాలను చెప్పారు. పాలు నీరు చెలిమిలో చెప్పుడు మాటలు వినకూడదని, వంకాయలు, టెంకాయలు కథ ద్వారా అందంతో ఎవరు మిడిసిపడకూడదని తెలియజేశారు. ఉపాయం కథ ద్వారా కుందేలు మొసలి బారినుండి తప్పించుకొని కొలనులో నీరు తాగి ఉపాయంతో ఏదైనా సాధించవచ్చని తెలియజేస్తుంది. చిలిపి చిలుకలో చిలుక చిలిపి చేష్టలతో పిల్లల అల్లరి స్వభావాన్ని తెలిపి, తోటివారితో కలిసిమెలిసి ఆనందంగా ఉండాలని ఉండాలని చెప్పారు. కుందేలు కోరికలో మంచితనమే మనకు సహాయం చేస్తుందని,ఎలుక, ఏనుగు కథలో భుజబలం కంటే బుద్ధి బలం మేలని తెలిపారు.

ప్రతి కథకు అందమైన రంగురంగుల బొమ్మలు ఇచ్చారు. ఇవి బాలలను మరింత ఆకట్టుకునేలా ఉన్నాయి. పిల్లల స్థాయికి అనుగుణంగా, వారి ఊహలకు పదును పెట్టేలా స్నేహం, సహాయం, ఉపాయం, ఆలోచన లాంటి అంశాలను కథలో భాగంగా సహజ సిద్ధంగా చెప్పిన తీరు బాగుంది. పిల్లలకు భాషపై మక్కువ కలిగేలా, వారి పఠనం వేగవంతమయ్యేలా, విలువలను పెంపొందించేలా ఈ కథలు ఉన్నాయి. పిల్లల కోసం రూపొందించిన ఈ కథలు వారికి ఎంతో ఆనందం కలిగించేలా, వారి భావాలను ప్రతిస్పందించేలా ఉన్నాయి. ఈ కథలు చదువుతున్నపుడు బాలలు దాదాపుగా వారి ఊహా ప్రపంచంలోకి వెళ్లగలుగుతారు.

తెలుగు సాహిత్యంలో పిల్లల కథలు ఇంకా రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పుడిప్పుడే పెద్దలతో పాటు పిల్లలు కూడా విరివిగా బాల సాహిత్య రచనలు చేయడం సంతోషించదగిన విషయం. పురిమళ్ల సునంద బాలలకో బహుమతి అంటూ చేసిన ఈ ప్రయత్నం బాల సాహిత్యంలో చిరస్థాయిగా నిలుస్తుంది. పలువురు బాల సాహితీవేత్తలకు ఇది స్ఫూర్తిదాయకం అవుతుందని చెప్పవచ్చు. సరళ, గుణిత వాక్యాలతో ఈ కథలను రాసి బాలలకు బహుమతిగా ఇవ్వడం అభినందనీయం. సుందన గారి కలం నుండి మరిన్ని వినూత్నవైన, అద్భుతమైన బాల సాహిత్య రచనలు వస్తాయని ఆశిద్దాం.

**ప్రతులకు..**
బోగోజు ఉపేందర్ రావు
సాహితీ లోగిలి,
ఇం. నెం. 11-10-694/5
బురహాన్ పురం, ఖమ్మం జిల్లా.
9441815722

–కందుకూరి భాస్కర్
9703487088

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 350వ రోజు 'కొరియర్ బాయ్' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'కొరియర్ బాయ్' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం ఏకాంశ కవిత్వం నిర్వహణ:
**డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839**

## కొరియర్ బాయ్

అతని రాక కొరకై
ఎన్నో కన్నుల ఎదురు చూపులు
వీధి నుండి వచ్చే ఏ అలికిడైనా
అతడేనేమో అని పరిగెత్తే కాళ్ళు
నేడు సర్వసాధారణం...
అది ఇది అని కాదు
సర్వం సందేశాత్మకం
రెక్కలు గట్టుకు వాలిన వైనమే
అతని విధి నిర్వహణంతా..
క్షణమాగని కాలం
పోటీపడి పరుగులు
మారిన జీవనశైలి
మారిన ఇచ్చిపుచ్చుకునే ధోరణి.
కాలు కదపకుండానే
కాసుల రూపును మార్చి
కంటికి నచ్చినవెన్నో
నమ్మిన నమ్మకం సాక్షిగా
నెట్టింట్లో నుండి
నట్టింట్లోకి దారులు
పొందుతున్నాడు కదా
మెరుగైన సేవలు వేగంగా.
పేదా ధనిక తారతమ్యమెరుగని దారి
అందిపుచ్చుకున్న ఆధునికత
ఆగమేఘాల నడుమ
అరచేతిన నిలిచిన
అడ్రస్సును చేరుకోవడమే పరమావధి
దూరతీరాలెన్నో దాటుకున్న
పార్సిల్లను పదిలంగా
అందించడమే కర్తవ్యం.

-శ్రీలతరమేశ్ గోస్కుల

## సత్వర బట్వాడా

విలువైన పత్రాలు పంపాలన్నా
వస్తువులు సత్వరం చేరాలన్నా
కొరియర్ ని ఆశ్రయించాల్సిందే..
తపాలా కంటే స్పీడు
రక్షణ ఎక్కువ
రవాణాలో జాడ కనిపెట్టే సౌలభ్యం
జవాబుదారితనం ఎక్కువ
రవాణా చార్జీ ఎక్కువైనా
ఆకర్షణే
ఏరియా సుపరిచితం
సర్వకాల సర్వావస్థల్లో
బట్వాడా సౌలభ్యం
ప్రపంచ వ్యాప్త విస్తరణ
సైకిల్ నుంచి విమానం
బైక్ ఏదైనా రవాణాకే
యువతకి ఉపాధి కొరియర్.

- మోటూరిశాంతకుమారి

## సింగిడి పూలు

మార్పుకు ఆహ్వానం
మార్పు అనివార్యం
చేతి రాతల పత్రహరితాలు పంచిన
చిలుకల రెక్కలకు ఎగిరే ఓపిక లేదు
ఆదరణ ఆరుద్ర పురుగు జాడైంది.
కలం శిల్ప కలలు
కంప్యూటర్లోకి భేతాళ కథలు
అద్భుతమైన రూపాల కల్పన.
కాలం రెప్పల సప్పుడులో
మేఘమాలికల సింగిడి పూలు
కొన్ని సూరీడికి కృతజ్ఞతలు
మరికొన్ని చూపులకే కరిగిపోయాయి.
సైకిల్ బెల్ ట్రింగ్ ట్రింగ్ లో
ఉత్తర ప్రత్యుత్తరాల మురిపెం
రవాణా సౌకర్యాలతో పేరు మార్చుకుని
కొరియర్ అవతారమెత్తిన కొత్త ఉత్తేజం.
పూసిన పుష్పాల తోట మాలులు
వస్తువుల బట్వాడాలో సీతాకోక చిలుకలు
వాహనారోహకులై వీపున అంబారీ
చిరునవ్వుల వెన్నెలతో
చిరునామాల్లో అప్పగింతలు.
నేటి కొరియర్ కుర్రాళ్ళు
పూల తోటలో విచ్చుకుంటున్న
మల్లెమొగ్గలు
రేపటి మార్పులకు
వాడిపోని నందనవనాలు
జ్ఞాన జలధి తరంగాలు
తూరుపు సింధూరాలు.

- ఏడెల్లి రాములు

## మనలో ఒకడు

శ్రమించి సంపాదించే వాడు
శ్రమ గౌరవం తెలిసినవాడు
ఒళ్ళు దాచక పని చేసే వాడు
ఆత్మగౌరవం కలిగిన పేదోడు
కొరియర్ బాయ్ గా మెప్పిస్తాడు.
ఉన్నంతలో గౌరవంగా జీవిస్తాడు
మర్యాదకు మారు పేరు
సహనానికి నిర్వచనం
సమయ పాలనకు చిరునామా
విధి నిర్వహణలో సాటెవ్వరు
ఫోను చేసి మరీ వచ్చే మర్యాదస్తుడు
చిరునవ్వుతో పలకరించి పోతాడు
ధన్యవాదాలు చెప్తే పులకించి పోతాడు
పోస్టుమ్యానుకు ప్రత్యామ్నాయం
మన దైనందిన మిత్రుడు
గౌరవిద్దాం అతని వృత్తిని ఎల్లప్పుడు
ఆధునిక జీవితంలో మనలో ఒకడు.

-జె.వి.కుమార్ చేపూరి

## అందరికీ ఉపయోగపడేవాడు

మూట మాదిరి
పెద్ద గోతంసంచి
నడుముకు వెనుక పెద్ద బరువు
మోటారువాహనంపై వెళుతూ
అందరిని మెప్పిస్తూ ఒప్పిస్తూ
కాల్ చేస్తూ అడ్రెసు చూపిస్తూ
ఇంటి ఇంటికి తిరిగి
కొరియర్ చేతికిస్తూ
కోవిడ్ పరిస్థితుల్లో రక్షణతో
ఎవరు ఏ విధంగా చెప్తే
అలా ప్రవర్తించే కొరియర్ బాయ్
మంచి ప్రవర్తనకు మారుపేరు.
ఉన్నతంగా జీవిస్తాడు
మర్యాదగా ప్రవర్తిస్తాడు
సహనంగా నిలబడతాడు
గౌరవంగా మాట్లాడతాడు
చిరునవ్వుతో అలరిస్తాడు
తనమంచిని తనే కాపాడుకుంటాడు
మన అందరికి ఉపయోగపడేవాడు.

- తాతపూడి సోమశేఖర శర్మ

## రవాణా వ్యక్తి

ఏదో ఒక ప్రాంతం సరుకు
ఆఫీసు ఆదేశాలు
ఇంటికి తెచ్చి ఇచ్చే వ్యక్తి.
దూరాభారం లేకుండా
అతి తేలిక గా రవాణా
ఎంత ఖరీదైన వస్తు వైనా
ఇంటి ముందుకు డెలివరీ
కొరియర్ వారికి వెన్నతో పెట్టిన విద్య
ఎక్కడి వస్తువులో
త్వరితంగా రవాణా
కొరియర్ ద్వారానే ఆన్లైన్ వస్తువులు
అన్ని ఈ పద్దతి లో తెచ్చే వ్యక్తి
కొరియర్ బాయ్.

-నారుమంచి వాణీ ప్రభాకరి

## శ్రమైక జీవన ప్రతినిధి

సమాజంలో చిన్న చూపు
నిజానికి అతడు
శ్రమైక జీవన ప్రతినిధి
మనం చూపించాల్సింది
ఎప్పుడూ పెద్ద చూపే
మనమతని నుండి
నేర్చుకోవాల్సింది ముందు చూపే
మనం అభీష్ట వస్తువును
మన ఇంటిముందుకు తెచ్చే సాధనమతడు
తల్లిదండ్రుల ఇబ్బందులను తొలగించే
సహకార వారసత్వమతడు.
చదువుకుంటూనే
కొరియర్ అవతారం
తల్లిదండ్రుల కష్ట సుఖాల్లో భాగం
సమాజంలోని తోటి వారితో కలిసి
తిరుగుతాడు
తనకన్నా ఎక్కువ కష్టాలకు స్పందనలు
తనకున్నదాంట్లోనే
సహాయపడేందుకు ప్రయత్నాలు.
మనసుంటే
అవకాశముంటే
అతనిలాంటి వారికి
చేతనైన సహాయం చేద్దాం
సాయం చేసే చేతుల
చిరునామా చెబుదాం
మనం బ్రతకడమే కాదు
బ్రతకడమే కష్టమైన
మన చుట్టూ ఉన్నవారినీ
బ్రతికించుకుందాం.

-నాగిరెడ్డి అరుణ జ్యోతి

## అఘు మేఘాలపై..

వస్తువుల బట్వాడా కోరిన చోటుకి
ఆఘుమేఘాల పైన చేర్చే ఆప్తుడు
పంపే వస్తువులు
స్థాయిని దూరాన్ని బట్టి
రుసుము వసూలుతో
ఇచ్చిన చిరునామాకు
భద్రంగా చేర్చే క్రమం
ఎదుర్కునే అనుకోని సంఘటనలెన్నో
అయినా పట్టువదలని విక్రమార్కుడు
నిజాయితీ
మర్యాద
ఓర్పు
ముఖ్యలక్షణాలు
విధినిర్వహణ చేస్తూ
మరిన్ని అవకాశాలు పొందుతూ
అవమానమూ భరిస్తూ
కుటుంబశిలువ మోసే క్రీస్తు!.
చిరుద్యోగులు
నిరుద్యోగులు
పార్ట్ టైంజాబ్ గా
విద్యార్థులు,వనితలు
సహనం కవచం తొడుక్కొని
వ్యాధినిరోధక సూత్రం కట్టుకొని
కోరినవి అందించే
కొరియర్ ఉద్యోగంలో!
అమ్మమందులు
పాపాయి నాపీలు
బామ్మర్దికి పుస్తకం
తాతయ్య కళ్ళజోడు
సదా మీ సేవలో అనే
దినకరుడు కొరియర్ బాయ్ !!
నీ రుణమెలా తీరునోయ్!.

- ఎం. వి. ఉమాదేవి

## శ్రమైకజీవి

ఆకాలంలో
శుక హంస రాయబారాలు !
ఒకప్పుడు పావురాలు
తపాలాబంట్రోతులు వార్తాహరులు!
ఆపై పల్లె పట్నం లో తపాలాసేవలు!
కాలం పరుగు ఒకేతీరు
మనిషి జీవనవిధానం
రోజు రోజుకీ పరుగుల చక్రాలు!
ఆఘుమేఘాల పై
వార్తలు వస్తువులు తినుబండారాలు
ఏఊరు చేరాలన్నా
ఖండాలు దాటాలన్నా కొరియర్ బట్వాడా.
ఉదయం నించి పొద్దుపోయినా
ఒళ్ళు వంచి బుర్రపెట్టి
సైకిల్ పై బుల్లెట్ బుల్లోడు
రయ్ రయ్ న దూసుకుపోయే
కొరియర్ బాయ్!
అతని రాకతో
ఇంటిల్లిపాదీ కళకళ!.
ఆఫీసు అర్జెంటు పత్రాలు!
పత్రికాఫీసులకి
కట్టలకట్టల రచనలు
నవలారాజాలు
వడివడిగా అదే ఊరు ఐతే
రెండురోజులలో డెలివరీ
విదేశాలకి వడియాలు
రకరకాల ఊరగాయలు స్వీట్స్
హాట్స్! పండుగ దుస్తులు!
ఇంటికి వచ్చి తనే ప్యాక్ చేసి
ఆఫీసులో చేర్చి
తృప్తిగా నిట్టూర్పు విడిచే
కొరియర్ కుర్రాడు ఆపద్బాంధవుడు!
చిరునామా వెతికి
కాలనీ గాలించి
ఫోన్ చేసి
స్వయంగా పార్శిల్!
లిఫ్ట్ లేని అపార్ట్మెంట్ లో
బరువుల మోత
ఆయాసంతో పార్శిల్ అందించి
సంతకంతో సంతృప్తి పడే
అతను అందరి ఆత్మీయుడు!
ఓప్రక్క చదువుకుంటూ
జీవనోపాధికై పార్ట్ టైం జాబ్!
అలసట విసుగు విరామం
ఎరుగని అతను ఆసుపోసిన కండె!
నమ్మకం నిజాయితీకి మారుపేరు!.
పంపేవారి పుచ్చుకునేవారి
కడుపులో చల్ల కదలకుండా
తీసుకుని వస్తాడు!
వచ్చినవి చిరునామా చూసి
చిరునవ్వు తో అందిస్తాడు!.
కొరియర్ బాయ్ అందుకే
అందరికీ స్నేహితుడు!
నిస్వార్థంగా
ఒళ్ళు దాచుకోకుండా
ఎండా వానా చలి భరిస్తూ
సర్వకాల సర్వావస్థలందూ
కాలంతో పనిలేకుండా
పరుగులు దీసే శ్రమజీవి!
తుమ్మితే ఊడే ముక్కు ఉద్యోగం
కానీ ఆశతో సాగే శ్రమైకజీవి!.

-ఎ.రాజ్యశ్రీ

## మధ్యవర్తి

వ్యాపారికి
వినియోగదారులకు
మధ్యవర్తే కొరియర్ బాయ్
లాభ నష్టాలతో
సంబంధం ఉండదు
వస్తువేందో అవసరం ఉండదు
వ్యాపారి ఇచ్చింది
వినియోగదారుడికి
చేర్చడమే ఆయన విధి
తక్కువ బరువు
వస్తు రవాణాకు ఒక వాహకం
పోస్టాపిసుకు ప్రత్యామ్నాయం
రూపాంతరం
పెద్ద వ్యాపారం
చిరుద్యోగం
అలసట లేకుండా
లబ్దిదారుకు
చేర్చడమే కర్తవ్యం
నిత్య కృత్యం
ఒక్కొక్కప్పుడు ఇరువైపులా
చివాట్లు
కాదంటే ఊడే ఉద్యోగం
ఖండాంతరానికి ప్రాకిన
కొరియర్ వ్యాపారం.
రెక్కాడితే గాని డొక్కాడని
శ్రమజీవి కొరియర్ బాయ్
చిరునవ్వుతో స్వాగతిద్దాం.

-గుండం మోహన్ రెడ్డి

# సమాజ హితానికి పుస్తకాలు దోహదం

పుస్తక ఆవిష్కరణ సభలో జీవన్‌లాల్, అనుహ్యారెడ్డి, జె.డి. లక్ష్మీనారాయణ, బిక్కి కృష్ణ, రచయిత్రి రాజావాసిరెడ్డి మల్లీశ్వరి తదితరులు.

సమాజ హితానికి మంచి పుస్తకాలు దోహదపడతాయని వక్తలు కొనియాడారు. ఆదివారం రాత్రి సుందరయ్య కళా నిలయంలో రాజా వాసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ గజల్ కవయిత్రి, భాషావేత్త రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి రాసిన మల్లియలు, నిరాతప, ఒక్క పదం అరాలెన్నో పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. హాజరైన ఐటీ కమీషనర్, జీవన్‌లాల్, విశ్రాంత ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ, లయన్స్‌క్లబ్ ప్రతినిధి విజయ్‌కుమార్, రచయిత బిక్కి కృష్ణ తదితర వక్తలతో కలిసి పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలో అవినీతిని రూపుమాపేందుకు, దేశాభివృద్ధికి పుస్తక చైతన్యం కీలకమన్నారు. వివిధ రంగాల్లో సేవలందించిన సీహెచ్ బాలకృష్ణ వక్తలను సత్కరించారు. ఆయా రంగాల ప్రతినిధులు విశ్వ ప్రసాద్, అనూహ్యారెడ్డి, వైఎస్సార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# పద్యవిద్య ప్రవీణుడు రామకృష్ణమాచార్య

రచయిత్రులకు జ్ఞాపికలు అందజేస్తున్న కేంద్ర సమాచార హక్కు చట్టం పూర్వ కమీషనర్ మాడభూషి శ్రీధర్, ఆచార్య ఫణీంద్ర, కళా జనార్ధనమూర్తి తదితరులు

పద్యవిద్య ప్రవీణుడు రామకృష్ణమాచార్య అని కేంద్ర సమాచార హక్కు చట్టం పూర్వ కమీషనర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. ఆదివారం త్యాగరాయ గానసభ కళా సుబ్బారావు కళావేదికలో నిర్వహించిన నండూరి రామకృష్ణమాచార్య సాహిత్యపీఠం,, నవ్య సాహితీ సమితీ సంయుక్తాధ్వర్యంలో మహాకవి నండూరి రామకృష్ణమాచార్య శతజయంతి ఉత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. తెలుగు, సంస్కృత భాషా సాహిత్యాల్లో అసమాన ప్రతిభ గల రామకృష్ణమాచార్య ప్రభంద, పౌరాణిక గ్రంథాలను తాత్విక దృష్టితో వివరించారన్నారు. ఈ సందర్భంగా రచయిత్రులు డా॥ఎం. భారతి, పి. రాజ్యలక్ష్మిని సత్కరించి అభినందించారు. కె.సాగర్‌రావు అధ్యక్షత వహించగా, డా॥ భారతి, విజయ్‌కుమార్, ఆచార్య ఫణీంద్ర, కళా జనార్ధనమూర్తి, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్థ సేవకులకు సమాజంలో గుర్తింపు

విజయ్‌కుమార్‌కు జ్ఞాపిక అందిస్తున్న మాజీ ఎంపీ డా॥ సముద్రాల వేణుగోపాలచారి, దైవజ్ఞశర్మ తదితరులు.

నిస్వార్థంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్న వారికి సమాజంలో గుర్తింపు ఉంటుందని మాజీ ఎంపీ డా॥సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. సోమవారం సాంస్కృతిక సంస్థ కళానిలయం ఆధ్వర్యంలో కళా సుబ్బారావు కళావేదికలో ఏవీకే ఫౌండేషన్ సౌజన్యంతో వివిధరంగాల ప్రముఖులకు కళా పురస్కార్, సేవా పురస్కార్ బిరుదు ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నృత్య గురువులు మాధవి, కల్యాణి, పేరిణి సందీప్, సంధ్యారాణి, దుర్గారావులు కళా పురస్కార్, పద్మావతి, దాశరథి, సుబ్బలక్ష్మి, విజయలక్ష్మి, ఆలూరి విల్సన్‌లు సేవా పురస్కార బిరుదులు అందుకున్నారు. ప్రముఖులు శ్రీనివాస్, డా॥ లయన్ విజయ్‌కుమార్, దైవజ్ఞశర్మ, బ్రహ్మానందం, పుష్పలత, సురేందర్ పాల్గొన్నారు.

## అమాయకపు గుట్టన్న కథలు (పిల్లల హాస్య కథలు)

# పిసినారి మూట

ఒకసారి ఒక పిసినారి ఆసామి నెత్తిమీద మూటతో బస్సును దిగాడు. అప్పట్లో ఆటోలు, రిక్షాలు లేవు.బస్టాండ్ లో కూలీల కొరకు అతడు చూశాడు. చాలామంది ఆ మూటను మోయడానికి ముందుకు వచ్చారు. వారు ఆ మూటను మోయడానికి 50 రూపాయలు చెప్పారు. తాను అంత డబ్బు ఇవ్వనే ఇవ్వనని ఆ పిసినారి అన్నాడు. అప్పుడు ఆయన చూపు ఖాళీగా ఉన్న ఈ గుట్టనిపై పడింది. గుట్టన్నను పిలిచి ఆ పిసినారి "ఈ మూటను మోస్తావా! " అని అడిగాడు. గుట్టన్న పది రూపాయలు ఇస్తే మోస్తానని చెప్పాడు. ఆ పిసినారి నలభై రూపాయలు ఆదా అవుతాయని సంతోషంగా అంగీకరించాడు .

గుట్టన్న తన నెత్తిపై ఆ మూటను పెట్టుకుని కొంతదూరం వెళ్ళాడు. అది చాలా బరువుగా ఉంది. వాడు ఆ మూటతో కొద్ది దూరం వెళ్లిన తర్వాత బరువు ఆపలేక క్రింద పడవేశాడు. ఆ మూట లో ఉన్న గాజు వస్తువులు కొన్ని పగిలాయి. వెంటనే ఆ పిసినారిఆసామి ఆ గాజు వస్తువులను క్రింద పడవేసిన గుట్టన్నను కోప్పడి పగిలిన వస్తువుల వెలను కట్టమన్నాడు .తన దగ్గర డబ్బు లేనే లేదని చెప్పాడు గుట్టన్న. అతడు వినకపోవడంతో గుట్టన్నకు కోపం వచ్చి ఆ మూటను అక్కడనే పడవేసి వెళ్ళబోయాడు.ఆ పిసినారికి ఏం చేయాలో అర్థం కాలేదు .ఇప్పుడు ఆ మూట బరువును తాను మోయలేడు. అందువల్ల వెంటనే గుట్టన్నను బుజ్జగించి తాను డబ్బును అదగననీ, ఇకనైనా ఆ మూటను జాగ్రత్తగా పట్టుకొమ్మని అన్నాడు . అప్పుడు గుట్టన్న దానిని తన తలపైన పెట్టమన్నాడు. ఆ మూట బరువైనప్పుడల్లా ఆ మూటను దించుటలో తనకు సహాయం చేయాలని గుట్టన్న ఆ పిసినారిని కోరాడు.పిసినారి అందుకు అంగీకరించాడు .

కొద్దిదూరం పోగానే గుట్టన్న ఆ మూటను దించమని చెప్పాడు .చేసేదిలేక ఆ పిసినారి మళ్లీ మూటను కింద పడవేస్తాడని భావించి ఆ మూటను కిందికి దించాడు. పది నిమిషాలైనా గుట్టన్న ఆ మూటను తలపైకి ఎత్తుకోలేదు. వాడు పిల్లలు ఆడే ఆటలను ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

పిసినారి గుట్టన్నను గట్టిగా గదమాయించడంతో తిరిగి ఆ మూటను ఎత్తి తన తలపైన పెట్టమన్నాడు. పిసినారి చేసేదిలేక వాడి నెత్తి పైన తిరిగి ఆ మూటను తాను కూడా పట్టుకుని వాడి తలపైన పెట్టాడు.కొద్ది దూరం నడిచే సరికి గుట్టన్న తిరిగి ఆ మూటను దించమని, కొద్దిసేపు ఆమూటను పిసినారినే మోయమని , తనకు వేళ్ళు నొప్పెడుతున్నాయని అన్నాడు. ఆ పిసినారి గుట్టన్నపై కోపగించాడు. వెంటనే గుట్టన్న ఆ బరువు మూటను క్రింద పడవేసి పరుగుతీశాడు. ఆ పిసినారి తన మనస్సులో ఈ అమాయకుడు తనకు తగిన శాస్తి చేశాడని భావించి తిరిగి మరొకరిని 50 రూపాయలకు మాట్లాడుకొని తన ఇంటి దారి పట్టాడు.

-సంగనభట్ల చిన్న రామ కిష్టయ్య
9908554535

## నానీలు

ఆకాశానికి
చిల్లులు పడ్డాయి
ఎడారికి
దాహం ఎక్కువ.

వాగ్దానాలు
అటకెక్కాయి
అటక మోసేది
ఎప్పుడూ నిందలే.

మనిషికి
రెక్కలు వస్తే
భూగోళం
మూట ,ముల్లి సర్థాల్సిందే

అరుగు
కనుమరుగయ్యింది
జ్ఞాపకాలు
తెరమరుగయ్యాయ్

కథలు
కావాలంటే
పుస్తకాలు కొనక్కరలేదు
కంచికి పోతే చాలు

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

## నానోలు

మాట
తూట
హృదయం
గాయం

నది
చంచలం
చెరువు
స్థిరం

తరువు
త్యాగం
తనువు
కాగితం

-చాపలమహేందర్
9949864152

## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

అడ్మిన్: రమాదేవి కులకర్ణి

# 'బుధవారం బాద్షా'

పోటీ ఫలితాలు

ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.
నిర్వహణ: **డా॥ప్రతికంఠం మాలతీలత**

## మహనీయుడుడ

ప్రథమ బహుమతి విజేత

తస్కరుడే తపముచేత
తాత్వికుడై
తప్పు గ్రహించి పునీతుడాయే
జంటపక్షుల విరహవేదన గాంచి
హృదిలోని శోకమే శ్లోకమాయే!.
వల్మికముకావల
మరామరా యను మాటే
రామ మంత్రమాయే
రత్నాకరుడు రమణీయంగా
రామాయణము రచియించే!.
లోకానికాదర్శప్రాయమైన
రామచరిత
పదికాలాలు పదిలంగా వర్ధిల్లే
మార్పు ఆవశ్యకమన్న
నిజము
మానుషజగతికి మార్గదర్శకమాయే!.
క్రౌంచపక్షి బాధ కోకిలను చేయగా
దోపిడీతనము వాల్మీకి
మతానికి నాందివేయగా
సుప్రభాతమే రసననుండి జనించగా
వాల్మీకి జగతికి మహనీయుడాయే!

-అయిత అనిత
8985348424

## కృషితో ఋషిగా మారిన మనిషి

ద్వితీయ బహుమతి విజేత

ఓ క్రూరుడిని
మహర్షిని చేసింది రామనామం
మనిషిలోని అహాన్ని అనిచింది రామనామం
విశ్వనీలో మహోన్నతమైనది రామనామం
లోకాన్ని సన్మార్గంలో నడిపింది
రామాయణం.
దారిదోపిడీ దొంగతనాలుచేస్తూ
పరుల హింసిస్తున్న రత్నాకరుడు
నారదునిచే తప్పు తెలుసుకొని
బంధనాలు తెంచుకుని తపస్సులో మునిగే.
రామ నామం పలకలేక
మరా మరా యనుచు
చెదలుపట్టి పుట్ట పెరిగినా
జపించిన మంత్రం
రామనామమై మనిషిని
మహర్షిగచేసింది
వాల్మీకిగ మార్చి
రామాయణ సృష్టికర్తను చేసింది.
కృషితో ఋషిగా మారిన వాల్మీకి
రమ్యమైన కావ్యంలో అక్షరాలకు
ప్రాణంపోసి
పాత్రలకు జీవం పోసి
బంధాలకు బాంధవ్యాలకు పీటేసి
జగద్రక్షుకుడైన శ్రీరామచంద్రుడి కథను
రమణీయ కమనీయమైన కావ్యంగ మలిచి
రామరసాన్ని
ఘన కీర్తిని జగతికి అందించి
లవకుశులకు గురువై ఇలలో
చరితార్థుడిగ నిలిచిన
మహాకవిని పూజిద్దాం.

-మండికారి బాలాజీ

## మనుజనైజము

మారడు మానవుండతని మార్చెడుయత్నము పూనబోకుమా
కోరిన మారబోడతడకుంఠితమై నిజవృత్తియుండు,తా
మారగబూనుకొన్నపుడు మారునుగాని పరప్రబోధనన్
మారునె? మారడెంతయును మానవనైజమునూహసేయుమా!

మంచిచెడులకు మూలము మనిషిమనసు
మనసుచెప్పిన మాటకే వినును నరుడు
ఇతరులెన్నియో చెప్పిన నేమి వినడు
బ్రహ్మసృష్టిలో వింతయదా ప్రాణియతడు!

దేవతగ మారుచో వాడు దేవుడగును
రక్కసునివోలె వర్తింప రాక్షసుడగు
వాని వర్తనయే వాని ఫలము దెలుపు
వేదరూపాల మనుజుడు విన్నమందు!

—డా॥ అయాచితం నటేశ్వరశర్మ—
9440468557.




కిన్నెర ఆర్ట్ థియేటర్స్
శ్రీ త్యాగరాయగానసభ
ఆహ్వానం

శాతవాహన విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి, ప్రముఖ కవి
ఆచార్య కడారు వీరారెడ్డి రచించిన
పాఠకులు కావలెను గ్రంథావిష్కరణ

తేది: 06-11-2021 శనివారం, సాయంత్రం 6 గంటలకు
కళా సుబ్బారావు కళావేదిక, శ్రీ త్యాగరాయగానసభ, చిక్కడపల్లి

ముఖ్యఅతిథి ఆవిష్కర్త : ఆచార్య కట్టా నరసింహారెడ్డి ప్రముఖ కవి, ఉపకులపతి, జె.ఎన్.టి.యు.
సభాధ్యక్షులు : ఆచార్య అనుమాండ్ల భూమయ్య, పూర్వ ఉపకులపతి, పాల్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
గౌరవ అతిథులు: ఆచార్య మసన చెన్నప్ప, తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం
శ్రీ కళా జనార్ధనమూర్తి, అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ
శ్రీ భైస దేవదాసు, నేటి నిజం దినపత్రిక సంపాదకులు
కృతి స్వీకర్తలు : శ్రీమతి & శ్రీ దాస్యం గీతారాణి - సేనాధిపతి దంపతులు ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు

డా॥ ఆర్. ప్రభాకరరావు, I.P.S. (Retd.) అధ్యక్షులు, కిన్నెర
మద్దాళి రఘురామ్ కార్యదర్శి, కిన్నెర
కళాశారద కార్యదర్శి, త్యాగరాయగానసభ


## బిందు ఆర్ట్స్ - హైదరాబాద్

ఆహ్వానం

కీ॥ శే॥ శ్రీ కోటంరాజు సత్యనారాయణశర్మ
శ్రీమతి అలివేలు మంగతాయారు
స్మారక సాహితీ పురస్కారాల సభ

31-10-2021 ఆదివారం సాయంత్రం 6గంటలకు... జూం అంతర్జాల వేదికపై

2020 సం॥ పురస్కార గ్రహీత: శ్రీ దేవరకాండ శేషగిరిరావు, కాకినాడ
2021 సం॥ పురస్కార గ్రహీత: డా॥ అయాచితం నటేశ్వరశర్మ, హైదరాబాద్

సభాధ్యక్షులు: డా. సి భవానీదేవి గారు, ప్రముఖ రచయిత్రి
ముఖ్య అతిథి: "ప్రసార ప్రవీణ" డా. వోలేటి పార్వతీశం గారు, పూర్వ కార్యనిర్వహణాధికారి, దూరదర్శన్
గౌరవ అతిథి: డా. సిహెచ్ సుశీలమ్మ గారు, ప్రముఖ రచయిత్రి
ఆత్మీయ అతిథి: శ్రీమతి ముప్పలనేని ఉదయలక్ష్మి గారు, కాలిఫోర్నియా, అమెరికా
సభా నిర్వహణ: శ్రీ 'సాధన' నరసింహాచార్య గారు, ప్రముఖ సాహితీవేత్త



చి॥ ప్రణవ్ రెబ్బాప్రగడ
బర్మింగ్‌హం, యుకె
పద్యపఠనం

ఇట్లు
డా. సి.ఎస్.ఆర్.మూర్తి
అధ్యక్షులు

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.